
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 02.03.2018, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 39 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# కయ్యమా? వియ్యమా?



## కమలంతో మధనం

- తెంచుకుంటే ఓ తంటా
- కలిసుంటే హోదా మంట
- త్రిశంకుస్వర్గంలో చంద్రబాబు

**'ఓటు-నోటు'** కేసే లేకపోయుంటే ఇప్పుడు చంద్రబాబు రాజకీయ నిర్ణయాలు ఎలా వుండేవో తెలుసా? ప్రత్యేకహోదా ఇవ్వనందుకు నిరసనగా ఎన్డీఏ ప్రభుత్వం నుండి బయటకొచ్చుండేవాడు. తన మంత్రులిద్దరి చేత రాజీనామా చేయించి వుండేవాడు. రాష్ట్రంలో బీజేపీతో పొత్తు తెగదెంపులు జరిగి, ఆ పార్టీ మంత్రులిద్దరినీ బయటకు పంపుండేవాళ్ళు. ప్రత్యేకహోదా సాధన కోసమంటూ ఢిల్లీకి చేరి ఆ ముసుగులో అన్ని ప్రాంతీయ, జాతీయ పార్టీల అధినేతలను కలిసి తృతీయ ఫ్రంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టివుండేవాడు. బీజేపీని మతోన్మాద పార్టీ అని విమర్శిస్తూ రాష్ట్రంలో మైనార్టీల ప్రాపకం కోసం ప్రయత్నించేవాడు.

'ఓటు-నోటు' కేసు మూలంగా రాష్ట్రానికి జరిగిన అన్యాయం అందరికీ తెలుసు. ఈ కేసు మూలంగానే పదేళ్ళ ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌పై హక్కును వదులుకున్నాం. కేసీఆర్ అక్కడ తంతే వచ్చి ఉండవల్లిలో కృష్ణానది గట్టున పడ్డాం. ఈ కేసును చూపించే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏపికి ప్రత్యేకహోదా లేదని, ప్యాకేజీతోనే జరిగిన డామేజీని పూడ్చుకోమంటే... ఇది అన్యాయమని నిలదీయలేకపోయాం. ఈ కేసు మూలంగా రాష్ట్ర ప్రజలకు జరిగిన నష్టం అంతా ఇంతా కాదు.

అయితే రాష్ట్రానికే కాదు, రాజకీయంగా కూడా చంద్రబాబుకు ఈ కేసు వల్ల ఎంతో నష్టం, ఎంతో కష్టమొచ్చింది. నాలుగేళ్ళుగా రాష్ట్రానికి కేంద్రం వరుసబెట్టి అన్యాయం చేస్తుంటే ఇదేమని ప్రశ్నించే ధైర్యం ఆయనకు లేకుండాపోయింది. ఇదే చంద్రబాబు 1998-2004ల మధ్య ఎన్డీఏ ప్రభుత్వంలోనే చక్రం తిప్పాడు. ఆనాటి ప్రధాని వాజ్‌పేయి, ఉపప్రధాని అద్వానీలు చంద్రబాబుకు ఎంతో విలువ ఇచ్చారు. చంద్రబాబు ఎప్పుడు కావాలంటే అప్పుడు ప్రధాని అపాయింట్‌మెంట్ దొరికేది.

అప్పటి వాజ్‌పేయి ప్రభుత్వం కాలం నాటికి నేటి మోడీ (మిగతా 11వ పేజీలో)



# దైవం చెంతకు దేవి

## ➤ శోకంలో సినీ లోకం

దాదాపు అయిదు దశాబ్దాల పాటు భారతీయ చిత్రపరిశ్రమను ఉర్రూతలూగించిన అగ్రతార శ్రీదేవి తిరిగిరాని లోకాలకు తరలిపోయింది. అందం, అభినయంతో అభిమానుల గుండెల్లో తనదంటూ ఓ ప్రత్యేకముద్ర వేసుకున్న అందాలతార... అతిలోక సుందరి.. అనంతలోకాలకు చేరిపోయింది. అశేష అభిమానజనానికి ఇక సెలవంటూ.. ఏ కన్నీళ్లూ.. ఏ శోకాలూ లేని దిగంతాలకో... ఏ దూర సుదూర తీర సరోవరాలవతలికో తరలివెళ్ళిపోయింది. ఆమె జీవితమంతా నటనలోనే ఉండిపోయింది.. 54 ఏళ్ళ జీవితంలో 50 ఏళ్ళు నటనారంగంలోనే పండిపోయింది. నటించిన ప్రతి సన్నివేశంలోనూ జీవించింది. దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాలను అన్నిటినీ ఒకటి చేస్తూ, ప్రాంతాలకు భాషలకు అతీతంగా నటనా ప్రావీణ్యంతో భారతీయ నటనా రంగంలో ఆమె ఒక విశిష్ట తారగా అవతరించింది. అంతటి విశేషనటనానుభవం ఉన్న ఏకైకనటి భారతదేశంలో ఒకే ఒక్క నటి... మహానటి.. శ్రీదేవి కావడం తెలుగువారి అదృష్టం.

(మిగతా 11వ పేజీలో)



# శివయ్య సన్నిధికి సరస్వతి

## ➤ విషాదంలో భక్తజనం

ప్రఖ్యాత ఆధ్యాత్మికవేత్త, అపర శంకరాచార్య, హిందూ సనాతన ధర్మ పరిరక్షకుడు, కంచి కామకోటి పీఠాధిపతి, శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి స్వామీజీ శివసాయుజ్యం పొందారు. హిందూ ధర్మాన్ని జగజ్జేయమానం చేస్తూ, ప్రత్యేకించి శంకరమఠం ప్రతిష్టను ప్రపంచ వ్యాప్తం చేసేందుకు జీవితాంతం అహర్నిశలు నిర్విరామంగా శ్రమించారు జగద్గురు శ్రీ జయేంద్ర సరస్వతి స్వామీజీ. ఆయనకు 83 ఏళ్ళు. తమిళనాడులోని కంచి కామకోటి పీఠానికి ఆయన 69వ అధిపతిగా వ్యవహరిస్తున్నారు. ఫిబ్రవరి 27 మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో భక్తులకు దర్శనమిచ్చిన స్వామీజీ, అనంతరం తన గదిలోకి వెళ్ళి నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత తీవ్ర అస్వస్థతకు గురికావడంతో భక్తులు హుటాహుటిన సమీపంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్ళి చికిత్స చేయిస్తుండగా, ఉదయం గుండెపోటు వచ్చి స్వామివారు మహానిర్యాణం చెందారు. జయేంద్ర సరస్వతి స్వామీజీ పార్థివ దేహానికి మఠం ఉత్తరాధికారి శంకర విజయేంద్ర సరస్వతి పూజలు చేశారు. స్వామిజీ నిర్యాణం చెందడంతో భక్తులు కన్నీరుమున్నీరయ్యారు.

(మిగతా 11వ పేజీలో)





# ఏసిబి దాడితో దడదడ

## నెల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు

నెల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గత నెల 26వతేదీ రాత్రి అవినీతి నిరోధకశాఖ అధికారులు ఆకస్మికదాడులు చేపట్టారు. పక్కా ప్రణాళిక, వ్యూహంతో నెల్లూరు మద్రాసుబస్టాండ్ వద్దనున్న పాత జూబ్లీ హాస్పిటల్ ప్రాంగణంలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1 ప్రసాదరెడ్డి, నలుగురు బయట వ్యక్తులను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద నుంచి రూ. 76వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసిబి డిఎస్పీ పి.పర మేశ్వర్‌రెడ్డి ప్రజల నుంచి అదనంగా వసూలు చేసిన నగదును ఎలా పంచుకుంటారనే విషయాన్ని వివరించారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజల నుంచి ఫీజ్ టు ఫీజ్ పద్ధతిలో వసూలు చేస్తారనే ఫిర్యాదుల నేపథ్యంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. సోమవారం మంచిరోజు కావడం, రిజిస్ట్రేషన్లు ఎక్కువుగా ఉంటాయని దాడులు చేసినట్లు వివరించారు. నలుగురు ఏజెంట్లు కార్యాలయంలో ఉండటం గమనించి వారిని విచారించగా వారి వద్ద నగదును గుర్తించినట్లు తెలిపారు. బయట ప్రాంతాల్లో ఉన్న డాక్యుమెంట్ రైటర్ల ద్వారా సబ్‌రిజిస్ట్రార్‌కు ఇచ్చేందుకు వచ్చినట్లు ఏజెంట్లు చెప్పారన్నారు. సబ్‌రిజిస్ట్రార్ పి.వి.ప్రసాదరెడ్డితో పాటు నలుగురు ఏజెంట్లు మింజు శివ, మేరిగ తిరుపతి, తిరుపాల్, ఖలీల్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నామన్నారు. ఈ దాడుల్లో ఏసిబి సి.ఐ శివకుమార్‌రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

# సూళ్ళూరుపేట మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసరావు

నెల్లూరుజిల్లా సూళ్ళూరుపేట మునిసిపల్ కమిషనర్‌గా కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న వై.శ్రీనివాసరావును నియమించారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడలో అదనపు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూనే సూళ్ళూరుపేట కమిషనర్‌గా ఆయన వ్యవహరిస్తారు. అక్కడి కమిషనర్‌ను ప్రభుత్వం విధుల నుంచి తప్పించడంతో శ్రీనివాసరావుకు అదనంగా బాధ్యతలు అప్పగించారు. కొత్త కమిషనర్ వచ్చేవరకూ ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థలో జోనల్ కమిషనర్‌గా పనిచేస్తు శ్రీనివాసరావు గత ఏడాది జూన్ 13న కాకినాడ నగరపాలక సంస్థకు అదనపు కమిషనర్‌గా బదిలీపై వచ్చారు.


**FORM IV**
(See Rule 8)

Statement about Ownership and other Particulars about News Paper, **Lawyer (Weekly)**

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 2. Periodicity of its Publication | : | Weekly |
| 3. Printer's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 4. Publisher's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 5. Editor's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 6. Name and Address of individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total Capital | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |

I, Thunga Siva Prabhath Reddy hereby declare that the particulars given above are true to the best of my Knowledge and belief.

(Sd)

01.03.2018 SIVA PRABHATH REDDY.T


# హోదాపై రాజీలేదు

## - కలెక్టరేట్ ముట్టడిలో వైసిపి నేతలు



ప్రత్యేకహోదా సాధన పోరాటంలో భాగంగా వైసిపి అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ఈ నెల 1వ తేదీన వైకాపా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముట్టడి, మహాధర్నా కార్యక్రమం జరిగింది. వైసిపి కార్యకర్తలు పెద్దఎత్తున కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఈ సందర్భంగా హాజరైన ప్రజలనుద్దేశించి నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకహోదా పోరాటంలో వెనక్కు తగ్గే



రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో...



నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ నాయకత్వంలో...

ప్రసక్తే లేదన్నారు. చంద్రబాబు కేసులకు భయపడి కేంద్రానికి దాసోహమన్నాడు. ప్రత్యేకహోదాపై పెదవి విప్పలేకపోతున్నాడు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టాడు. ప్రత్యేకహోదా సాధన కోసం వైసిపి ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందని, పార్లమెంటులో పోరాటం చేస్తామని, ఎంపీలందరూ రాజీనామాలకు సిద్ధంగా ఉన్నామని ఎంపీ చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పి.అనిల్ కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, డిప్యూటీ మేయర్ ఎం.ద్వారకానాథ్, వైసిపి నేతలు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వంటేరు వేణుగోపాలరెడ్డి, నేదురుమల్లి పద్మనాభరెడ్డి, బొబ్బల శ్రీనివాసయాదవ్, బిరుదవోలు శ్రీకాంత్‌రెడ్డి, మురళీయాదవ్, లేబూరు పరమేశ్వరరెడ్డి, వేలూరు మహేష్, మేఘ నాథ్‌సింగ్, మేరిగ మురళి, ఎల్లసిరి గోపాలరెడ్డి, పి.రూప్‌కుమార్ యాదవ్, తాటి వెంకటేశ్వర్లు, మొయిళ్ళ గౌరి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

అలాగే సిపిఎం రాష్ట్ర నాయకులు పి.మధు, మాజీమున్సిపల్ వైస్‌ఛైర్మెన్ మాదాల వెంకటేశ్వర్లు ఈ మహాధర్నాకు హాజరై తమ మద్దతును ప్రకటించారు.

ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎంసిఏ గ్రౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు, అలాగే నెల్లూరునగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో రాజన్నభవన్ నుండి కలెక్టరేట్ వరకు వేలాదిమంది కార్యకర్తలతో భారీర్యాలీలు నిర్వహించారు.

# విఆర్‌కు సోమశిల ఎస్సై

నెల్లూరుజిల్లా సోమశిల ఎస్సై బి.జగన్మోహన్‌ను వీఆర్‌కు పంపిస్తూ జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ ఉత్తర్వులు విడుదల చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్సైపై ఎస్పీ వేటు వేశారు. ఇసుక ట్రాక్టర్ల యజమానుల వద్ద అధికమొత్తంలో వసూళ్ళు, కేసుల్లో సంబంధం లేని వ్యక్తుల్ని ఇరికించడం, ప్రజలపట్ల దురుసుగా ప్రవర్తిస్తూ సంఘ వ్యతిరేక, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని విఆర్‌కు పంపించారు.

# పాత సిఐలు అటాచ్!

గుంటూరు రేంజ్ పరిధిలో పనిచేస్తూ వివిధ కారణాలతో వి.ఆర్‌లో వున్న 8మంది సి.ఐలను నెల్లూరుజిల్లాకు అటాచ్ చేస్తూ రేంజ్ ఐ.జి కెవివి గోపాలరావు ఉత్తర్వులు జారీ చేశారు. విజయచంద్ర, జగన్మోహన్‌రావు, రత్తయ్య, రామారావు, వెంకటరమణ, దుర్గాప్రసాద్, మారుతీకృష్ణ, సుబ్బారావులు ఈ జాబితాలో వున్నారు. జిల్లాలో పలుచోట్ల సి.ఐలు లేనందున వీరిని ఆయా స్టేషన్‌లకు కేటాయించే అవకాశముంది.

# మానవాళి అభ్యుదయానికి శాస్త్రపరిశోధనలే కీలకం

## - 'జాతీయ సైన్స్ దినోత్సవం'లో డాక్టర్ కె. శాండిల్య





డాక్టర్ కె.శాండిల్యను సత్కరిస్తున్న విఆర్ కళాశాల ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందం

మానవాళి మనుగడకు, అభ్యుదయానికి, సమాజ సర్వతోముఖాభివృద్ధికి శాస్త్ర పరిశోధనలే కీలకమని ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో ఉన్న ఐఐటి కెమికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.కృష్ణ శాండిల్య అన్నారు. నెల్లూరు విఆర్ కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో గతనెల 28న నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవం వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు విద్యలో వారికి ఇష్టమైన విషయాలను కష్టపడి చదివి ఉన్నతస్థాయి శిఖరాలందుకోవాలని ఆకాంక్షించారు. ఇంజనీరింగ్ లేదా టెక్నాలజీలకు సంబంధించిన ఏ విషయంలోనైనా ఇమిడివున్న మూల సూత్రాలు శాస్త్రపరిజ్ఞానానికి సంబంధించినవేనన్నారు. నేటి పరిస్థితుల్లో దేశానికి, ఇంజనీరింగ్, లేదా టెక్నాలజీ రంగాల కంటే సైన్స్ రంగంలో నిపుణులు అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన విఆర్‌కళాశాల ప్రిన్సిపాల్ డా. సివిఎస్ భాస్కర్ మాట్లాడుతూ, సర్ సివి రామన్ గొప్ప శాస్త్రవేత్త అని, మౌలిక పరిశోధనలకు ఆద్యుడని పేర్కొన్నారు. ఫిజిక్స్ విభాగం అధిపతి డా.ఎం.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, సర్ సివి రామన్ మరియు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌లు 1935వ సంవత్సరంలో విఆర్ కళాశాలను సందర్శించి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సమర్పించిన నివేదిక ఆధారంగా కళాశాలలో బిఎస్సీ కోర్సులు ప్రారంభమైనాయన్నారు. రామన్ ఎఫెక్ట్‌ను ప్రపంచానికి తెలియజెప్పిన ఫిబ్రవరి 28వ తేదిని ప్రతి ఏటా జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. అనంతరం డా. శాండిల్యను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.జి.కృష్ణ కిశోర్, వివి కృష్ణశర్మ, డా.బాబర్ అలీ మొహిద్దీన్, పి.సుధాకర్, డా.ఎం.పద్మప్రియ, సి.శ్యామల, డా. టి.వెంకటేశ్వర్లు, ఎన్.హనుమంతకుమార్, లైబ్రేరియన్ డా. ఎన్.ప్రభాకర్, జి.వేణు, ఏ. వేణునాధన్, టి.బాలయ్యతో పాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# దేవుళ్ళు కావలెను



పాఠం చెప్పే గురువు... చికిత్స చేసే వైద్యుడు...ఈ రెండు వృత్తులనే దేవునితో సమానంగా చూస్తారు.

విద్య బతుకునిస్తుంది...వైద్యం బతికిస్తుంది...మనిషి కనీస అవసరాలైన ఈ రెంటిని ఆర్థిక పరిస్థితితో ముడిపెట్టకుండా దేశాభివృద్ధికి ఆయువుపట్టు అయినా పల్లెటూర్లలో అందరికి అందించాలన్న లక్ష్యంతో గత 20 సంవత్సారాల నిర్విరామ అవిరళ కృషికి ప్రతిరూపం ప్రజ్ఞ ప్రియ ఫౌండేషన్.

విద్యారంగంలో రెండు ఉన్నత పాఠశాలలు, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకి ఉపకార వేతనాలు మరియు వైద్యరంగంలో రెండు ఉచిత ఆసుపత్రులు నిర్మించి నిర్వహిస్తూ సేవా మార్గంలో తమదైన ముద్ర వేస్తోంది ప్రజ్ఞ ప్రియ ఫౌండేషన్.

తమ అక్షర-ఆరోగ్య యజ్ఞ ఫలాలు ఇంకెంతోమంది ప్రజలకు చేరువ చేసే దిశలో భాగంగా నెల్లూరు జిల్లా **బుచ్చిరెడ్డి పాలెం మండలంలో** గ్రామీణ ప్రాంతమైన **కాళయకాగోల్లులో** 24గంటల ఉచిత ఆసుపత్రి, ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాల త్వరలో ప్రారంభిస్తున్నారు.

ఇందులో సేవ చేయుటకు సేవాతృష్ణ గల అభ్యర్థులు కావలెను. వారికి అర్హతలతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం మరియు చక్కటి Communication skills (ఆంగ్లం) కలిగి ఉండడం తప్పనిసరి. ఎంపికైన అభ్యర్థులకు పారితోషికం, P.F., ESI benefits తో పాటు నెల్లూరు నుండి ప్రతిరోజు bus సదుపాయం కూడా ఇవ్వబడుతుంది.

సంక్షేమ భారతం కోసం వైద్యాలయంలో గ్రామీణ ప్రజలకు తగు వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ మిక్కిలి ఓర్పు, అంకితభావంతో విధులు నిర్వహించగల అభ్యర్థులు కావలెను. ఎంపికైన అభ్యర్థులు మరొక చోట విధులు నిర్వహించరాదు.

## వైద్యాలయం కొరకు :

**డాక్టర్స్** - ఎమ్.బి.బి.ఎస్, పురుషులు / స్త్రీలు, **జనరల్ ఫిజిషియన్** - ఎమ్.డి, **గైనకాలజిస్ట్** - డి.జి.ఎం / ఎమ్.డి, **పెడియాట్రిషియన్** - ఎమ్.బి.బి.ఎస్, ఎమ్.డి (పెడియాట్రిక్స్), **రేడియాలజిస్ట్** - పార్టైం , ఫ్రెష్ /ఎక్స్‌పీరియన్స్‌డ్, **రేడియోగ్రాఫర్స్, లాబ్ టెక్నీషియన్** - డిప్లొమా / డిగ్రీ, **నర్స్** - బి.యస్.సి. (నర్సింగ్) క్వాలిఫైయిడ్ జీఎన్ఎమ్, **అంబులెన్స్ డ్రైవర్స్, వార్డ్ బాయ్స్ & ఆయాలు**

## విద్యాలయం కొరకు (ఆంగ్లమాధ్యమం):

భావి భారత పౌరుల ఉజ్వల భవిత కొరకు అత్యుత్తమ విద్యతో పాటు ఉన్నత విలువలు బోధించి వారి నడవడికను సరైన మార్గంలో నడిపించగల సమర్థవంతులు, ధృడ సంకల్పములగల అభ్యర్థులు కావలెను.

**ప్రిన్సిపాల్** - ట్రైన్డ్ పి.జి. సుమారు 25 సంవత్సరాల అనుభవం. అందులో 10 సంవత్సరాలు అడ్మినిస్ట్రేషన్ లో చేసి ఉండాలి. **వైస్ ప్రిన్సిపాల్** - ట్రైన్డ్ పి.జి. సుమారు 20 సంవత్సరాల అనుభవం అందులో 5 సంవత్సరాలు అడ్మినిస్ట్రేషన్ లో చేసి ఉండాలి, **టీచర్స్** - సబ్జెక్టు - తమ సబ్జెక్టులో గ్రాడ్యుయేషన్ తో పాటు బి.ఎడ్ మరియు 3-5 సంవత్సరాలు ఉన్నత తరగతులకు బోధించిన అనుభవం, టీచర్స్ - సబ్జెక్టు - డి.ఎడ్, 2 సంవత్సరాలు ప్రీ ప్రైమరీలో బోధించిన అనుభవం, **టీచర్ - ఫిజికల్ ఎడ్యుకేషన్** - ఫిజికల్ ఎడ్యుకేషన్ లో డిప్లొమా / డిగ్రీ, **అడ్మినిస్ట్రేటర్స్, ఆయాలు**

ఆసక్తి గల అభ్యర్థులు ఈ దిగువ చెప్పిన మెయిల్ ఐడి కి రెజ్యూమ్స్ పంపించగలరు.

seva@pragnyapriya.com



**ప్రజ్ఞ ప్రియ ఫౌండేషన్**

విద్య... వైద్యం... వికాసం...

(Non - Profitable Organization)



## 'ప్రభా'తం

# అవినీతితో అప్రతిష్ట

**దేశంలో అవినీతి కుంభకోణాలు పెరిగిపోతున్నాయి. నీరవ్‌మోదీ, కొఠారి వంటి అక్రమార్కుల కుంభకోణాలు దేశాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. అనేకరంగాల్లో అవినీతి పాతుకుపోతోంది. అవినీతిపై కొరడా ఝుళిపించక, కేవలం నీతులు వల్లించుకుంటూ పోతే..చివరికి దేశంలో అవినీతే సర్వాంతర్యామి అవుతుంది. కేంద్రం వెంటనే ఈ అక్రమార్కుల భరతం పట్టాలి. అవినీతి అంతుచూడాలి. అక్రమార్కులను శిక్షించి తీరాలి. లేకుంటే, అవినీతి అక్రమాల గుప్పెట్లో దేశం అణగారిపోతుంది.**

ఈ కలికాలంలో 'అవినీతే సర్వాంతర్యామి' అన్నట్లుగా ఉంది. ఎక్కడ చూసినా అవినీతే విలయతాండవం చేస్తోంది. అక్రమాలు, మోసాలు, కుంభకోణాలు భారీస్థాయిలో వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మన దేశంలోనూ అవినీతి అక్రమాలకు కొదవే ఉండడం లేదు. 2జీ స్పెక్ట్రమ్, బొగ్గు కుంభకోణాలు వంటి అనేక అవినీతి అక్రమాలు గత కాంగ్రెస్ పాలనను తుడిచిపెట్టుకుపోయేలా చేశాయి. అప్పట్లో ఈ అవినీతి పుట్టలు పగిలి పాపాల పాములెన్నో బుసలుకొడుతూ బయటికి వచ్చినా, ఇక అలాంటి అవినీతికి తావే ఇచ్చేది లేదంటూ వచ్చి భరోసా ఇచ్చిన బిజెపిని చూసి ప్రజలెంతో సంతోషించారు. అయితే, ఆ సంతోషం ఎంతోకాలం నిలబడేట్లు కనిపించడం లేదు.

ఏ పార్టీ అధికారంలో ఉన్నా అవినీతికి ఎదురే లేదు.. అక్రమార్కులకు బెదురే లేదు.. అన్నట్లుగా ఉంది పరిస్థితి. తాజాగా అంతర్జాతీయస్థాయిలో వెలువరించిన అవినీతి సూచీలో మనదేశం 79 నుంచి 81 కి దిగజారడం ఇందుకు నిదర్శనం. న్యూజిలాండ్, డెన్మార్క్, ఫిన్లాండ్, నార్వే, స్విట్జర్లాండ్ వంటి దేశాలు అవినీతి లేని నీతిమంతమైన దేశాలుగా ప్రఖ్యాతి చెందుతుంటే, భారత్ మాత్రం అవినీతి రోగంతో కుళ్ళిపోతోంది. మనదేశంలో అవినీతి అక్రమాలు అన్ని రంగాల్లోనూ వేళ్లూనుకుంటున్నాయి. పైసాలోనే అంతా. ముడుపులు మూట కట్టందే ఇక్కడెవరూ పనులు చేయరు. అలా తేరగ్గా పనులు చేయడానికి ఇక్కడెవరూ లేరు.. అన్నట్లుగా ఉంటోంది వ్యవహారమంతా. అందులోనూ ప్రభుత్వరంగ సంస్థల్లో, బ్యాంకుల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఒక చోటని కాదు..సర్వే సర్వత్రా అంతా అవినీతి అక్రమాలే విస్తరిస్తున్నాయి. రంగమేదైనా.. స్థాయిని బట్టి అవినీతి చెద అల్లుకుంటూనే ఉంటుంది. నకిలీ వ్యవహారాలతో ప్రజల్ని, దేశాన్ని దోపిడి చేసే డొల్ల కంపెనీల భరతం పడతాం అని ప్రధాని మోదీ పదేపదే హెచ్చరిస్తున్నా, సరిగ్గా అలాంటి డొల్లకంపెనీలతోనే బ్యాంకులకు టోకరా కొట్టే కొఠారి లాంటి వాళ్ళు ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మిగిలారు. ఇలాంటి అవినీతి మాయగాళ్ల భరతం పట్టడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేక పోవడం ఎంతైనా విచారకరం. ఆయా బ్యాంకులకు సంబంధించినవారే అక్రమార్కులకు సహకరించారని తెలియడంతో కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా విస్తుపోతున్నాయి. దీనికంతటికీ కారణం అవినీతే. నీరవ్‌మోదీ, విజయ్‌మాల్యా వంటివారు బ్యాంకుల సిబ్బంది సాయంతోనే, బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టి కోటానుకోట్ల రూపాయలు తీసుకుని ఎగవేయడం వెనుక ఉన్నది..ఆ అవినీతి రక్కసేనన్నది అందరికీ తెలిసిందే. బ్యాంకుల్లో సాధారణ ప్రజలకు ఓ లక్ష రుణం కావాలంటే సవాలక్ష యక్షప్రశ్నలతో నెలల తరబడి తిప్పుకుని కన్నీరు పెట్టిస్తారు. అదే బ్యాంకుల్నే బురిడీలు కొట్టించే మోసగాళ్ళకు మాత్రం కోటానుకోట్లు అప్పనంగా ఇచ్చేయడంలో అవినీతిదే కీలకపాత్ర అని వేరే చెప్పాల్సిన పనే లేదు. అన్ని రంగాలు, చివరికి ప్రభుత్వ కార్యాలయాలు కూడా అలాగే తయారవుతున్నాయి. ఓ చిన్న పని కావాలన్నా అక్కడి సిబ్బంది నిరుపేదలు, అభాగ్యులు.. సామాన్యులకు చుక్కలు చూపిస్తుంటారు. కరుణ, జాలి, దయ, చివరికి మానవత్వం అన్నది కూడా చాలామందిలో లేశమైనా ఉండడం లేదు. అదే అవినీతిపరులకు, అక్రమార్జనలతో కోట్లు గడించుకున్నవారికైతే ఎలాంటి పనికావాలన్నా సరే.. వారే క్షణాల మీద చక్కబెట్టేస్తుంటారు. కారణం.. అవినీతే. ముడుపులిస్తే చాలు ఎంతటి పనైనా అయిపోతుంది. ఇటీవల వజ్రాల వ్యాపారులు నీరవ్‌మోడీ, మొహుల్ చోక్సీ చేసిన భారీ మోసాలు దేశాన్ని అతలాకుతలం చేశాయి. ఈ మోసం మొత్తం విలువ ఎంతో తెలుసా?.. సుమారు రెండు బిలియన్‌ల డాలర్లట. అంటే, ఈ కుంభకోణం మొత్తం అక్షరాలా 12,717 కోట్లని పంజాబ్ నేషనల్ బ్యాంక్ తాజా నివేదిక వెల్లడిస్తోంది. చూడండి ఎంత భారీ కుంభకోణమో!.. ఇంత భారీ మొత్తంలో మోసం చేసి బ్యాంకుల్ని దివాలా తీయించే అక్రమార్కులకు మనదేశంలో రెడ్‌కార్పెట్ పరిచే దుస్థితి..ఎంత ఘోరమో కదా!.. ఈ కుంభకోణంలో నిందితుడైన నీరవ్‌మోడీ మాత్రం హాయిగా అమెరికాలో దివాలా దరఖాస్తు పెట్టుకోవడం చూస్తే... ఇలాంటి ఘరానా మోసగాళ్ళ బరితెగింపు ఎలాంటిదో విశదమవుతుంది. నీరవ్‌మోదీ, విక్రమ్ కొఠారీ వంటి మోసగాళ్ళకు, లోపాయికారిగా సహకరించి బ్యాంకుల డబ్బును కోట్లకు కోట్లు దోచిపెట్టడం వెనుక ఉన్నది కూడా..అవినీతి భూతాలే. అయినా, బ్యాంకుల్లో ఇలాంటి ఇంటిదొంగలు ఇంకా ఎంతమంది ఉన్నారో, ఎన్ని కోట్లు తిన్నారో..ఇంకా తింటూనే ఉన్నారో కేంద్ర నిఘా దర్యాప్తు బృందాలు లెక్క తేల్చాల్సి ఉంది. తిన్నదంతా కక్కించాల్సి ఉంది. అంతేకాదు, కాన్పూర్‌కు చెందిన విక్రమ్ కొఠారి అక్రమాలు తవ్వే కొద్దీ దర్యాప్తు బృందాలే విస్తుపోతున్నాయిట. బోగస్ కంపెనీలను సృష్టించి ఏకంగా బ్యాంక్‌ల నుంచి 3,695 కోట్లు రుణంగా తీసుకున్నాడని, నిబంధనలు ఉల్లంఘించి కొఠారి రుణాలు పొందాడని చెప్తున్నాయి. వీటన్నిటి వెనుక అవినీతి జలగలు ఎన్ని ఉన్నాయనేది లెక్క తేల్చాల్సింది కేంద్ర దర్యాప్తు బృందాలే. ఈ నేపథ్యంలో, కేవలం రెండేళ్ళలోనే ప్రభుత్వరంగ బ్యాంకులకు సంబంధించిన 5200 మంది ఉద్యోగులు రకరకాల మోసాలకు పాల్పడ్డారని ఆర్‌బిఐ అధికారికంగా గుర్తించినట్టు తాజా సమాచారం. ఇలాంటి ఇంటిదొంగలు ఇంకెంతమంది ఉన్నారో ఆ దేవునికే ఎరుక. దేశంలో అవినీతి ఇంత హాయిగా తిష్టవేసుకుని ఉన్నా పట్టించుకోకపోవడాన్ని ఏమనాలి?...విశుద్ధ పాలన, అవినీతి రహిత పాలన వంటి నినాదాలు వినడానికి బావున్నా, ఆచరణలో కనిపించకుంటే భవిష్యత్తు అంధకారమవుతుంది.

కేంద్రం వెంటనే ఇలాంటి మోసాలపై కొరడా పట్టుకోకుంటే, డొల్లకంపెనీల భరతం పట్టకుంటే.. అవినీతి అక్రమాల అంతు చూడకుంటే ప్రభుత్వ ప్రతిష్ట మసకబారుతుంది. అవినీతిని పట్టించుకోక, కేవలం నీతులు వల్లించుకుంటూ పోతే.. చివరికి నిజంగా అవినీతే సర్వాంతర్యామి అవుతుంది. దేశం అవినీతి భారత్‌గా మారుతుంది. అవినీతి అక్రమాల గుప్పెట్లో దేశం అణగారిపోతుంది. అప్పుడు ఎవరెంతగా వగచినా.. ఫలితం మాత్రం శూన్యమే!...

# ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి

### - బిజెపి నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి



విలేకర్లతో మాట్లాడుతున్న కర్నాటి ఆంజనేయరెడ్డి

రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించి రైతులను ఆదుకోవాలని బిజెపి రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతనెల 24న నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం మిల్లర్లను పొలాల దగ్గర కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటుంటే, మన రాష్ట్రంలో రైతు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ, మన రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంపై విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు ప్రజలకు వాస్తవాలు తెలియ జేయడానికి పార్టీ కార్యకర్తలంతా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పెదరోశయ్య, జయరాజ్, శ్రీనివాసులు, పరశురాం, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సొరంగమార్గంలో ముమ్మరంగా రైల్వే పనులు



నెల్లూరుజిల్లా కృష్ణపట్నం – కడపజిల్లా ఓబులాపురం రైల్వేలైన్ నిర్మాణ పనులు చివరిదశలో ఉన్నాయి. మొత్తం రూ.1800 కోట్లతో 95కి.మీ. పరిధిలో ఈ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే రాపూరు, డక్కిలి, సైదాపురం, పొదలకూరు మండలాల్లోని వందలాది గ్రామాల ప్రజల జీవన విధానం మెరుగయ్యే అవకాశాలున్నాయి. మాధవయ్యపాలెం(రాపూరు సమీపంలోని వెలిగొండల) వద్ద రైల్వే సొరంగ మార్గంలో అధునాతన యంత్రాలతో సిమెంట్ కాంక్రీట్ ప్లాస్టరింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సొరంగమార్గం సుమారు 6.634 కిలోమీటర్లు ఉంటుంది. 7.32 మీటర్ల ఎత్తు, 7.5మీటర్ల వెడల్పుతో రూ.407.29 కోట్లతో పనులు చేపట్టారు. ఈ రైల్వేలైన్ నిర్మాణం పూర్తయితే యూరియా, పాస్ఫేట్ వంటి రసాయన ఎరువుల దిగుమతి, ఇనుప ఖనిజంతో పాటు, క్వార్ట్ తదితర ఖనిజాలను ఎగుమతి చేసేందుకు దోహదపడుతుంది. జూన్ 13న రైల్వేమంత్రి జన్మదినం సందర్భంగా ట్రయల్‌రన్‌గా రైలును నడపాలన్న సంకల్పంతో అధికారులు పనుల్ని వేగవంతం చేస్తున్నారు.

## కిలారికి అభినందనలు

కోవూరులో నూతన గ్రంథాలయ నిర్మాణానికి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు 15.50 లక్షలు మంజూరు చేయడం అభినందనీయం. ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన 16 నెలల్లోనే గ్రంథాలయ నిర్మాణానికి ఇంత పెద్దమొత్తం మంజూరు చేసిన వారిని ఇంతవరకు చూడలేదు. కోవూరు గ్రంథాలయంకు ఎంతో చరిత్ర వుంది. 1955లో గ్రామ పెద్దలు సన్నపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పి.వి.రమణారెడ్డి, మొలకల గోపాలకృష్ణారెడ్డి, బచ్చల సుందరరామిరెడ్డి వంటివారు ఈ గ్రంథాలయాన్ని స్థాపించారు. ఎందరో విద్యావంతులు, మేధావులకు ఈ గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడింది. 3ఏళ్ళ క్రితం శిథిలావస్థలో వున్న ఈ లైబ్రరీని కూలగొట్టారు. కొత్త లైబ్రరీ భవన నిర్మాణానికి చేయూతనిచ్చినందుకు కోవూరు వాసుల తరపున కిలారి వెంకటస్వామినాయుడుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

**జీలుమూడి యానాదిరెడ్డి, కోవూరు.**

## మరపురాని నటీమణి

భారత చలనచిత్ర టాప్ హీరోయిన్ శ్రీదేవి హఠాన్మరణం యావత్ సినీలోకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. దేశంలోని అన్ని ప్రధాన భాషల చలన చిత్ర రంగాలలో ప్రవేశం వున్న నటి ఆమె. నటనకు అర్థం చెప్పింది. ఎన్నో అద్భుత పాత్రలలో రాణించింది. జననం నుండి మరణం వరకు సినిమా ప్రపంచంతోనే తన ప్రయాణాన్ని కొనసాగించింది. భారత రాజకీయాలంటే ఇందిరాగాంధీ, జయలలిత, మమతా బెనర్జీ వంటి నాయకురాళ్ళు ఎలా గుర్తుకువస్తారో, భారత సినిమా పరిశ్రమ అంటే శ్రీదేవి అలా గుర్తుకు వస్తారు. ఆమె మరణం సినీ పరిశ్రమకు తీరనిలోటు.

**పైడికొండ సాంబశివరావు, చెన్నై.**

## లక్షల కోట్లు ఏమయ్యాయో!




గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో పారిశ్రామిక సదస్సులు నిర్వహిస్తూనే వున్నారు. ప్రపంచంలో ఆయా దేశాలలో చంద్రబాబు పర్యటిస్తూనే వున్నారు. పారిశ్రామిక సదస్సులలో గాని, విదేశీ పర్యటనలకు గాని వెళ్ళినప్పుడు రాష్ట్రానికి లక్షల కోట్లలో పెట్టుబడులు పెడుతున్నట్లు పత్రికలు వ్రాసాయి. చంద్రబాబు ప్రకటించిన పెట్టుబడులలో పది శాతం వచ్చివున్నా ఈరోజు పారిశ్రామికాభివృద్ధిలో ఏపి పరుగులు పెడుతుండేది. ఈ నాలుగేళ్లలో ఈ రాష్ట్రంలో పెట్టుబడులు పెడతామంటూ ఎవరూ రాలేదు. అనంతపురంలో 'కియా' మోటార్స్ తప్పించి పెద్ద పరిశ్రమలేవీ లేవు. మళ్ళీ విశాఖపట్నంలో సదస్సు పెట్టి లక్షల కోట్లు పెట్టుబడులకు ఎంఓయులు అంటున్నారు. ఇలా ఎన్నాళ్లని జనం చెవుల్లో పూలుపెడతారు?

**ఎన్.సత్యప్రకాశ్‌రెడ్డి, నెల్లూరు.**

# ఆర్థిక నేరాల అడ్డాగా నెల్లూరు




- అమాయకులే లక్ష్యం
- వారి ఆశలతోనే వ్యాపారం
- వారి స్వేదమే దోపిడీ

*ఒక నాగార్జున ఫైనాన్స్... ఒక సిటీ ఫైనాన్స్... ఒక అగ్రిగోల్డ్... ఒక ఆర్‌బిఐఎఫ్... ఒక సీవ్‌ఫార్మ్... ఒక చైన్ లింక్ స్కీం... ఇప్పుడు మంత్ర పీఠికల మాయా జాలం... కంపెనీలు వేరైనా కాన్సెప్ట్ ఒక్కటే... అమాయకుల నుండి దండుకోవడం, టోపీ పెట్టి పరారవ్వడం.*

రాష్ట్రంలోనే నెల్లూరుజిల్లాకు ఒక ప్రత్యేకతవుంది. ఈ జిల్లాలో ఫ్యాక్షన్ లేదు, రౌడీయిజం లేదు, రాజకీయ నాయకుల దందాలు లేవు. పద్ధతిగా పనులు, వ్యాపారాలు, ఉద్యోగాలు చేసుకుని పోయే వాళ్ళకు ఎంతో అనువైన జిల్లా.

ఇలాంటి జిల్లాలో అంతుబట్టని నేరాలేంటంటే వైట్‌కాలర్ నేరాలే. ఫైనాన్స్ మోసాలు ఎక్కువగా ఈ జిల్లాలో జరుగుతున్నాయి. ఒక చైన్ స్నాచింగ్ జరిగితే ఒక మహిళ నష్టపోతుంది. ఓ ఇంట్లో దోపిడీ జరిగితే ఆ కుటుంబంలో సభ్యులు నష్టపోతారు. కాని ఫైనాన్స్ నేరాలలో ఒక వ్యక్తి మోసం చేస్తే బాధితులు వందలు, వేల సంఖ్యలో వుంటారు. నష్టం కోట్లలో వుంటుంది. ఇది సున్నితంగా కనిపించే తీవ్ర నేరం.

గత పాతికేళ్లలో నెల్లూరు కేంద్రంగా జరిగిన ఫైనాన్స్ నేరాలన్నింటిని లెక్కకడితే బాధితులు పోగొట్టుకున్న సొమ్ము వందల కోట్లలో కాదు వేల కోట్లకు చేరుతుంది.

పాతికేళ్ల క్రితం నెల్లూరు నగరంలో ఫైనాన్స్ కంపెనీలు పుట్టగొడుగుల్లా వెలిసాయి. 10×10 అడుగుల గదిలో కూడా ఒక ఫైనాన్స్ ఆఫీసు ఉండేది. ఇలా దాదాపు 600 ఫైనాన్స్ కంపెనీలు వెలసి స్కీంల పేరుతో, ఐదేళ్లకు కట్టిన మొత్తానికి రెట్టింపు ఇస్తామనే ఎరతో అమాయకుల నుండి కోట్లు దండుకున్నాయి. ఒక్కటంటే ఒక్క కంపెనీ కూడా ఐదేళ్ళ పాటూ ఉండింది లేదు. ఒక్కరికంటే ఒక్కరికి కూడా కట్టిన సొమ్ము తిరిగి ఇచ్చింది లేదు. ఆ తర్వాత నెల్లూరు కేంద్రంగా ఎన్నో ఫైనాన్స్ కంపెనీలు వెలిసాయి. ప్రజల నుండి ఎక్కువ వడ్డీ ఆశ చూపి కోట్ల రూపాయలు కట్టించుకున్నాయి. ముఖ్యంగా ఏజంట్లు ఈ మోసాలకు వారధులుగా వుంటూవచ్చారు. కమిషన్లకు ఆశపడి వాళ్ళు తమకు తెలిసిన వాళ్ళ చేత, మిత్రుల చేత మొహమాటపెట్టి డిపాజిట్లు కట్టించేవాళ్ళు. కొద్దికాలంలోనే ఈ కంపెనీలు బోర్డులు తిప్పేసేవి. బాధితులు లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్‌లకు పరుగులు తీసేవాళ్ళు. ఈ ఫైనాన్స్ కంపెనీలను జనం ఎంత అమాయకంగా నమ్మారంటే... ఒకడు రామ్మూర్తినగర్‌లో ఆఫీసు పెట్టి మీరు కట్టిన డబ్బుకు 28రోజుల్లో రెట్టింపు ఇస్తామంటే వాళ్ళకు కోట్లు కోట్లు కట్టారు. 28 రోజుల్లో డబ్బు రెట్టింపు కావాలంటే వాళ్ళు కరెన్సీ ప్రింటింగ్ ప్రెస్ ఏదన్నా పెట్టుకుని వుండాలి. కనీసం జనం 28రోజుల్లో డబ్బులు ఎలా డబుల్ అవుతాయనే ఆలోచన కూడా చేయలేదు. మూడేళ్ల క్రితం జిల్లాలో సంచలనం సృష్టించిన మనీ సర్క్యులేషన్ స్కీం ద్వారా ప్రజలు వందల కోట్లలో నష్టపోవడం చూసాం. తాజాగా నెల్లూరు కిసాన్ నగర్‌లో సుధాకర్ మహరాజ్ బురిడీబాబా ఉదంతం... భక్తి ముసుగులో ఫైనాన్స్ చీటింగ్. మంత్రపీఠికలు వ్రాస్తే నెలలో డబ్బులు రెట్టింపు ఎలా అవుతాయనే ఆలోచన కూడా లేకుండా పోయింది.

ప్రభుత్వ బ్యాంకుల్లో దాచుకున్న డబ్బుకే ఈ రోజుల్లో దిక్కు లేకుండా పోతోంది. అలాంటిది ప్రైవేట్ కంపెనీలను, ప్రైవేట్ వ్యక్తులను నమ్మి ఎలా డిపాజిట్లు కడతారు. ఈ ఫైనాన్స్ మోసాలలో బాధితులుగా మిగులుతున్నది మధ్యతరగతి ప్రజలే! వాళ్ళు రూపాయి రూపాయి కూడబెట్టి ఒక పూట తిని ఒక పూట తినక కష్టంతో వచ్చిన డబ్బును ఇలాంటి పాపాత్ముల పరం చేస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభం లేదు. ప్రభుత్వాలు, పోలీసులను అనుకుని లాభం లేదు. ఒకడు ఇలా వ్యాపారం మొదలుపెడితే... ప్రజలు వచ్చి వారి వద్ద డబ్బులు డిపాజిట్ చేస్తుంటే ప్రభుత్వమేమీ ఆపలేదు. కాని అలా ఎవరినంటే వారిని నమ్మి డబ్బులు కట్టేటప్పుడు ప్రజలే ఆలోచించాలి... వారి గురించి తెలుసుకుని వుండాలి. ప్రజలు చైతన్యవంతులైతే తప్ప ఇలాంటి ఫైనాన్స్ మోసాలకు కళ్ళెం వేయలేము.

### తెలంగాణ సోన...

# రైతన్నలకు దిగుబడి వాన

- షుగర్‌లెస్ బియ్యంగా ఆదరణ



*ప్రజల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. ఏ టీవీలో చూసినా ఆరోగ్య విషయాలపై చర్చలే... ఏ ఆసుపత్రి వారు చూసినా ప్రజల ఆరోగ్యంపై అవగాహన కల్పించే క్యాంపులే! టీవీ చర్చల్లో అయినా, ఆరోగ్య అవగాహనా శిబిరాల్లో అయినా డాక్టర్లు చెప్పేది ఒక్కటే... రైస్ తగ్గించండి. ముఖ్యంగా జిలకరమసూరి బదులు మొలగొలుకుల బియ్యం తినండి... జిలకరమసూరి బియ్యంతో వండిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల మనిషిలో షుగర్ లెవల్స్ పెరుగుతాయని, వివిధ అనారోగ్యాలకు ఇది కారణమవుతుందనే ప్రచారం ఎక్కువగా వుంది. మరి ఈ ప్రచారం ఉధృతమై జిలకరమసూరి కొనుగోళ్ళు పడిపోతే దానివల్ల నష్టపోయేది రైతులే!*

అందుకే జిలకరమసూరికి ప్రత్యామ్నాయాన్ని ఆలోచించాల్సి వస్తుంది. ఈ క్రమంలోనే తెలంగాణ సోన 15048 ఆర్‌ఎన్‌ఆర్ రకం వరి వంగడాలు విస్తృత ప్రచారంలోకి వచ్చాయి. మన రాష్ట్రంలో వీటిని షుగర్‌లెస్ బియ్యంగా పిలుచుకుంటారు. 120రోజుల కాల వ్యవధితో ఈ పంట కోతకొస్తుంది. ఎలాంటి తెగుళ్ళనైనా తట్టుకోగల శక్తివున్న ఈ పంటకు జిలకరమసూరి, ఇతర రకాలతో పోలిస్తే పెట్టుబడి కూడా తక్కువే! తెగులు పట్టినా కూడా దానంతట అదే వదిలించుకుంటుంది. అగ్గితెగులును ఆశించదు. కాబట్టి పురుగుమందులను వాడాల్సిన అవసరమే రాదు. ఎకరాకు రెండు కట్టల కాంప్లెక్స్ ఎరువులు వాడాల్సి వుంటుంది. ప్రస్తుతం మనం వేస్తున్న పైర్లకు ఎకరాకు 25 నుండి 30వేలు దాకా ఖర్చవుతుంది. కాని తెలంగాణ సోనకు ఎకరాకు 15వేల నుండి 16వేలు దాకా (మిగతా 11వ పేజీలో)

### పారిశ్రామికవేత్తలు...

# ప్రజల సంక్షేమాన్ని ఆలోచించాలి

**- సిఎస్ఆర్ ఫండ్ వినియోగంపై సోమిరెడ్డి**



జిల్లాలోని పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ నిబంధనల మేరకు సిఎస్ఆర్ ఫండ్‌ను ఖర్చుపెట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గత నెల 24వ తేది నెల్లూరులోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో సిఎస్ఆర్ ఫండ్స్, మరియు అండర్‌గ్రౌండ్ సీవరేజ్, త్రాగునీటి పనులపై జిల్లా కలెక్టర్‌తో కలసి పారిశ్రామిక వేత్తలు, పబ్లిక్‌హెల్త్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ, కంపెనీలు ముందస్తు అనుమతి లేకుండా ఎవరికి తోచినట్లు వారు సిఎస్ఆర్ ఫండ్ నిధులు ఖర్చుచేయరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు ఆ ఫండ్ చెల్లించాలని, పరిశ్రమల స్థాపనకు భూములు ఇచ్చి నిరాశ్రయులైన వారిని ఆదుకోవాలని అన్నారు. వారికి అవసరమైన విద్య, వైద్యం, రహదారులు తదితర అవసరాలను గుర్తించి పనులు చేయాలన్నారు. జిల్లాలో 1100కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన 7లక్షల మందికి మంచినీటి పథకం పనులు, అండర్‌గ్రౌండ్ సీవరేజ్ పనులు చేస్తున్న పెద్ద కంపెనీలు, సబ్‌కాంట్రాక్టర్లకు ఇవ్వడం వల్ల సమస్యలు వస్తున్నాయని, పబ్లిక్‌హెల్త్ మరియు మునిసిపల్‌శాఖ వారు పనులు చేసేటప్పుడు ఆర్‌అండ్‌బి స్థలాలు పాయింట్ టు పాయింట్ మార్క్ చేసి వాళ్ళ స్థలాల్లో వేసుకోవాలన్నారు. జూన్ నెలాఖరు లోపల రోడ్లుమీద గుంటలు లేకుండా చూడాలన్నారు. వర్షాలు వస్తే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. మైపాడు, కొత్తకోడూరు రోడ్ల ఆక్రమణలు తొలగించి రోడ్లు వేయాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్, డిఆర్‌ఓ వెంకట సుబ్బయ్య, ఆర్డీఓ శ్రీమతి డి. హరిత, పరిశ్రమల శాఖ ఏ.డి మురళి, డి.డి వేలాయుధం, పబ్లిక్‌హెల్త్ ఎస్‌ఇ మోహన్, ఏపి జెన్కో ప్రతినిధి చంద్రశేఖర్, కృష్ణపట్నం పిఆర్‌హెడ్ వేణుగోపాల్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ (నాయుడుపేట) మేనేజర్ పవన్, సెంకార్ప్ ప్రతినిధి వంశీకృష్ణ, అరవిందో ఫార్మాప్రతినిధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### హోదా పోరాటంలో...

# వెనక్కు తగ్గం

**- ఎమ్మెల్సీ బీద రవిచంద్ర**




రాష్ట్రానికి మేలు చేసే ప్రత్యేకహోదా విషయంలో కేంద్రంతో పోరాడడానికి తెలుగుదేశంపార్టీ ఎప్పుడు సిద్ధంగానే ఉందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు. గత నెల 25వ తేదీ నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిద్ర లేచింది మొదలు నిద్రపోయే దాకా రాష్ట్రం కోసమే తపనపడుతున్నారని, ప్రత్యేకహోదా వద్దని చంద్రబాబు ఎప్పుడూ చెప్పలేదన్నారు. సాంకేతిక కారణాలరీత్యా ప్రత్యేకహోదా ఇవ్వలేమని, దానికి సమానమైన ప్రత్యేకప్యాకేజీ ఇస్తామని కేంద్రం చెబితే, రాష్ట్రానికి ఏదో ఒక రూపంలో మేలు జరిగితే చాలనుకున్న చంద్రబాబు దానికి ఒప్పుకున్నారు. కానీ, కేంద్రం ఆ మాటను కూడా నిలబెట్టుకోలేక పోయింది. నాలుగేళ్ళుగా చంద్రబాబు కేంద్రం నుండి రాష్ట్రానికి న్యాయం జరుగుతుందేమోనని ఓర్పుతో ఎదురు చూసారు. ఎన్నోసార్లు ఢిల్లీ వెళ్ళి ప్రధానిని, కేంద్రమంత్రులను కలిసి ప్రత్యేకప్యాకేజీకి చట్టభద్రత కల్పించాలని కోరారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై రాష్ట్రంలో అన్ని ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు కూడా నిరసన తెలుపుతున్నాయి. కానీ బీజేపీ, వైసిపిలే డ్రామాలాడుతున్నాయి. ఇక మాకు సహనం లేదని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎంతవరకైనా పోరాడుతామని ఆయన హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వాలు దక్షిణ రాష్ట్రాలను చిన్నచూపు చూస్తున్నాయని, దేశానికి తిరుపతిని రెండో రాజధానిగా ప్రకటించాలని, దక్షిణ రాష్ట్రాల ప్రజల ఆకాంక్ష ఇదని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీమతి టి.అనూరాధ, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎం.విజేత, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, పార్టీ కార్యాలయ సమన్వయకార్యదర్శి బి.మనోహర్‌రెడ్డి, మొయినుద్దీన్, కువ్వారపు బాలాజీ, డాక్టర్ శ్రీపతిబాబు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు కబుర్లు

# మొదలైన పరీక్షా కాలం



ఎండాకాలం మొదలైంది. అలాగే పిల్లలకు పరీక్షల కాలం కూడా మొదలైంది. ఫిబ్రవరి 28వ తేదీ నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు మొదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 92 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. సీనియర్, జూనియర్ విద్యార్థులు సుమారు 60వేల మంది పరీక్షలు వ్రాస్తున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా తమ బిడ్డలను పరీక్షా కేంద్రాలకు తీసుకెళ్లడానికి, తీసుకురావడానికి శ్రమ పడుతున్నారు. ఇంటర్ తర్వాత టెన్త్, ఇతర తరగతుల పరీక్షలు, నీట్, ఎంసెట్... ఇక రెండు నెలల పాటు పరీక్షాకాలమే!

# 'సంత'కు ఆధునిక సొగసులు

**- నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్**



స్మార్ట్‌సిటీ కన్సల్టెన్సీ ప్రతినిధి శివశరన్‌తో చర్చిస్తున్న మేయర్ అజీజ్

నెల్లూరులోని సంతపేట మార్కెట్‌ను అధునాతనంగా నిర్మించేందుకు అన్ని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. గత నెల 26న హరనాథపురంలోని ఆయన నివాసంలో స్మార్ట్‌సిటీ కన్సల్టెన్సీ ప్రతినిధి శివశరన్ మేయర్‌ను కలుసుకుని మార్కెట్ నిర్మాణ ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ అభివృద్ధి నిధులు, కార్పొరేషన్ సాధారణ నిధులు సుమారు రూ. 3కోట్లతో అన్ని సదుపాయాలున్న అధునాతన వాణిజ్య కేంద్రాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. క్రింది అంతస్తులో కూరగాయలు, వస్త్రాలు, మాంసాహారం విభాగాలను వేర్వేరుగా నిర్మించి మిగిలిన వాటిని కార్యాలయాలు, ఇతర వర్తక దుకాణాలకు కేటాయిస్తామన్నారు. మార్కెట్‌కు పార్కింగ్, పారిశుద్ధ్యం, సెక్యూరిటీ వ్యవస్థలను రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ప్రశాంత్ కిరణ్, కార్పొరేషన్ అధికారి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

# చిల్డ్రన్స్‌పార్క్‌లో వాకర్స్ ఉచిత వైద్యశిబిరం




మాట్లాడుతున్న డా॥ ఎం.వి.రామ్మోహన్

నెల్లూరు చిల్డ్రన్స్ పార్కులో గత నెల 25న వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అపోలో హాస్పిటల్స్ డాక్టర్లు, పొగతోటలోని ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డా॥ ఎం.వి. రామ్మోహన్ ఆధ్వర్యంలో ఉచితంగా షుగర్, బి.పి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ ఈమధ్య సోషల్ మీడియాలో వస్తున్న ఆహార నియమాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఎండోక్రైనాలజిస్ట్ పర్యవేక్షణలోనే ఆహార నియమనిబంధనలు పాటించాలని కోరారు. ఈ శిబిరంలో 130మందికి ఉచితంగా బి.పి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. చిల్డ్రన్స్ పార్కు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శింగంశెట్టి మురళీమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరును పరవశింపజేయనున్న...

# భక్తి సంగీత పరిమళం

- **మార్చి 6 నుంచి శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలు**



ఈ నెల 6వ తేది నుంచి 13వ తేది వరకు 53వ శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలను స్థానిక రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరంలో ఎంతో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడు రోజులు ప్రసిద్ధులైనవారిచే సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు. అందుకోసం గత కొద్దిరోజులుగా త్యాగరాజస్వామి ఆరాధకులు నెల్లూరులో వీధివీధినా తిరుగుతూ, శ్రీ త్యాగరాజస్వామి కీర్తనలను గానం చేస్తూ, జోలెకట్టి భిక్ష పట్టారు. ఈ ఉత్సవాల సందర్భంగా శ్రీ త్యాగరాజ స్వామి సంకీర్తనలతో, భక్తిగీతాలతో పుర మందిర ప్రాంగణం పరవశించిపోతుంది. శ్రీ త్యాగరాజస్వామి ఆరాధకులైన దివంగత శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, దివంగత యనమండ్ర వేంకటేశ్వర శాస్త్రిలు అప్పట్లో నెల్లూరు నలుమూలలా త్యాగరాజ కీర్తనలను ఆలపిస్తూ, జోలెకట్టి భిక్షపట్టి సంగీతసేవ నిర్వహించిన విషయం అందరికీ తెలిసిందే. శ్రీ త్యాగరాజ ఆరాధనలతో నెల్లూరును మరో తిరువయ్యార్‌లా తలపింపజేసిన మహానుభావులు వారు. ఆ మహనీయులు చేపట్టిన శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలను త్యాగరాజ స్వామి భక్తులు, సింహపురి ప్రజలందరి సహకారంతో శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభవారు నేటికీ కొనసాగిస్తూనే ఉండడం ఎంతైనా విశేషం. ఎంతో మహనీయమైన ఈ కార్యక్రమాన్ని కొనసాగించేందుకు ఏర్పడిన భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీకి శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి తనయుడైన విఖ్యాత గాయకుడు డా. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం శాశ్వత అధ్యక్షులుగా, యనమండ్ర వేంకటేశ్వరశాస్త్రి కుమారుడైన నాగదేవి ప్రసాద్ శాశ్వత కార్యదర్శిగా, మాచవోలు రాజశేఖరశాస్త్రి గౌరవాధ్యక్షులుగా, చతుర్వేదుల శ్రీరామమూర్తి అధ్యక్షులుగా ఉంటూ, ఆ కమిటీ ఆధ్వర్యంలో త్యాగరాజ స్మరణోత్సవాలను ప్రతిఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. నెల్లూరు నగరానికి ఆ సంగీత భక్తి పరిమళాలను ప్రతి ఏటా పంచుతూనే ఉన్నారు. ఈ ఏడాది మార్చి 6వ తేది నుంచి 12వతేది వరకు జరిగే ఈ స్మరణోత్సవాల్లో భాగంగా తొలిరోజైన 6వ తేది ఉదయం 7 గంటలకు నెల్లూరు వేదాయపాళెంలోని త్యాగరాజ మందిరం నుంచి శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్సమేత శ్రీ త్యాగరాజ విగ్రహాలను, శ్రీ త్యాగరాజస్వామి చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి టౌన్‌హాలులో ప్రతిష్ఠించి, పూజలు నిర్వహిస్తామని కార్యదర్శి యనమండ్ర నాగదేవి ప్రసాద్ తెలిపారు. ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ ప్రముఖులైన వారెందరో పాల్గొని ఎంతో భక్తిశ్రద్ధలతో సంగీత కచ్చేరీలు, హరికథా గానాలు, గాత్రకచ్చేరీలు, నాదస్వర కచ్చేరీలు వంటి భక్తి కార్యక్రమాలను నిర్వహిస్తారని, ప్రజలు..భక్తులందరూ విచ్చేసి ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.



నగరంలో భిక్షాటన చేస్తూ కీర్తనలు ఆలపిస్తున్న త్యాగరాజస్వామి ఆరాధకులు

# 13న 'జీవన దర్శనం' పుస్తకావిష్కరణ

హరికథా భిక్షువు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి అయ్యవారి 'జీవన దర్శనం' పుస్తకాన్ని ఈ ఉత్సవాల్లో 13వతేదీన ఆవిష్కరిస్తారు. ఎమ్మెస్ సూర్యనారాయణ రచించిన ఈ పుస్తకాన్ని సాంబమూర్తిగారి సతీమణి, విశ్వవిఖ్యాత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తల్లిగారైన శ్రీపతి పండితారాధ్యుల శకుంతలమ్మ ఆవిష్కరిస్తారు. ఈ సభను డా. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథులుగా సినీప్రముఖులు సిరివెన్నెల సీతారామశాస్త్రి, తనికెళ్ళ భరణి, వెన్నెలకంటి రాజేశ్వర ప్రసాద్‌లతో పాటు, ప్రముఖ పారిశ్రామికవేత్త కె.ఇ వరప్రసాద్‌రెడ్డి, లాయర్ వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి, మురళీకృష్ణ హోటల్స్ అధినేత గ్రోసు గోపాలయ్య, మురళీకృష్ణ హోటల్స్ సారథి వీరిశెట్టి హజరత్‌బాబు పాల్గొంటారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుచే ప్రవచనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

# డాక్టర్ బిందుమీనన్‌కు ఫెలోషిప్



ఇండియన్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ ఫెలోషిప్‌నందుకుంటున్న డాక్టర్ బిందుమీనన్

నెల్లూరులోని అపోలో ఆసుపత్రి న్యూరాలజీ విభాగం సీనియర్ కన్సల్టెంట్, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ బిందు మీనన్‌కు ఇండియన్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ వారు ఫెలోషిప్‌ను ప్రదానం చేశారు. ఆ మేరకు ఆమె ఫిబ్రవరి 23న బెంగుళూరులోని బాబూ రాజేంద్రప్రసాద్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన ఆ సంస్థ జాతీయ వార్షిక సదస్సులో ప్రతిష్ఠాత్మకమైన ఈ ఫెలోషిప్‌ను అందుకున్నారు. అకడమిక్, రీసెర్చ్, పబ్లికేషన్స్, సోషల్ వెల్ఫేర్ అండ్ కమ్యూనిటీ సర్వీసెస్‌లలో అత్యుత్తమంగా రాణిస్తున్న వైద్యులకు అందజేసే ఈ ఫెలోషిప్‌ను తమ ఆసుపత్రికి చెందిన డాక్టర్ బిందుమీనన్‌కు ప్రదానం చేయడంతో అపోలో ఆసుపత్రి వర్గాలు ఆనందం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఆసుపత్రికి చెందిన సహచరులు ఆమెను అభినందించారు.

# వీఆర్ కళాశాల అధ్యాపకుల విజయకేతనం



బహుమతులందుకుంటున్న షటిల్ విజేతలు

నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్సిటీ స్టాఫ్, మెన్ అండ్ ఉమెన్ క్రీడాపోటీలలో భాగంగా గత నెల 24, 25తేదీలలో జరిగిన క్రీడా పోటీలలో షటిల్ డబుల్స్‌లో మొదటి స్థానాన్ని వీఆర్ కళాశాల అధ్యాపకులైన డా॥ టి.వి.రవీంద్రరెడ్డి, డా॥ నరమాల ప్రభాకర్ కైవసం చేసుకున్నారు. ఈ విజయపరంపర గత 8సంవత్సరాలుగా వీఆర్ కళాశాలకు రావడం గర్వించదగ్గ విషయం. ఈ విజయానికి కారణమైన అధ్యాపకులకు కళాశాల మేనేజ్‌మెంట్, ప్రిన్సిపల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# దివ్యాంగులకు అన్నప్రసాద వితరణ



ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 24న అసోసియేషన్ సభ్యుడు వై.శ్రీనాథరెడ్డి మనుమడు వై.రిషి రెండవ పుట్టినరోజు సందర్భంగా ప్రగతి ఛారిటీస్‌లోని మానసిక వికలాంగులు, దివ్యాంగులకు అన్నప్రసాదం వితరణ చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు, కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శులు లక్కాకుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్‌డేలో భాగంగా ప్రజలనుండి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు

# ముత్యాలరాజుకు మండింది

ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగులకు సూర్యుడు నడినెత్తికొస్తే పొద్దున అయ్యిందని లెఖ్ఖ. ఆ లెఖ్ఖలోనే ఆఫీసులకు వస్తుంటారు. ప్రభుత్వ ఉద్యోగం అంటే వేళాపాళా లేకుండా ఎప్పుడైనా పోవచ్చు, ఎప్పుడైనా రావచ్చు అనే భావన చాలామంది ఉద్యోగుల్లో పాతుకుపోయింది. ప్రతిరోజూ విధులకు ఆలస్యంగా వచ్చే అధికారులు, సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌డే వుందని చెప్పి పొద్దున్నే వస్తారా? వాళ్ళ టైంకు వాళ్లొస్తారు. ఇలా వచ్చే జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజుకు అరికాల్లో మంటెక్కించారు.



ఆలస్యంగా వచ్చి బయట వేచిచూస్తున్న అధికారులు

ఫిబ్రవరి 26వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌డేకు ఉదయం 9.40గంటలకు కలెక్టర్ ముత్యాలరాజు వచ్చారు. అప్పటికి జేసీ-2 వెంకటసుబ్బారెడ్డితో పాటు కొద్దిమంది అధికారులే వచ్చి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్నారు. చాలా శాఖల అధికారుల సీట్లు ఖాళీగా వుండడం చూసి కలెక్టర్‌కు కోపం వచ్చింది. వెంటనే ఆయన గ్రీవెన్స్‌హాల్‌లోకి వెళ్ళి తలుపులు మూసేసి గడిపెట్టారు. దీంతో తాపీగా 10గంటల తర్వాత వచ్చిన అధికారులు హాలు బయటే నిలబడ్డారు. వారిని కలెక్టర్ లోపలకు అనుమతించలేదు. మధ్యాహ్నం 1.30గంటల దాకా కూడా కలెక్టర్, జేసీ, జేసీ-2లు బాధితుల నుండి అర్జీలు తీసుకుని వారి సమస్యలు పరిష్కరించారు. కలెక్టర్ తీసుకున్న నిర్ణయంతో ఆలస్యంగా వచ్చిన అధికారులు ఖంగుతిన్నారు.

# శ్రీ సిటీకి పెట్టుబడుల వెల్లువ




ముఖ్యమంత్రి సమక్షంలో అవగాహన ఒప్పంద పత్రాల మార్పిడి

నెల్లూరుజిల్లా పారిశ్రామిక ప్రగతికి దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి అందించిన కానుక శ్రీసిటి సెజ్. ఆయన చేతులమీదుగా శంకుస్థాపన జరిగి, ఆయన చేతులగుండానే ప్రారంభమైన ఈ సెజ్ దేశంలోనే ప్రముఖ సెజ్‌లతో పోటీపడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో విదేశీయులెవరైనా పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనపరుస్తున్నారా అంటే అది ఒక్క శ్రీసిటీ విషయంలోనే జరుగుతుంది. మొన్న విశాఖపట్నంలో జరిగిన సిఐఐ భాగస్వామ్య సదస్సులో కూడా ఆయా దేశాలకు చెందిన 14కంపెనీలు శ్రీసిటీలో 3500కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే టి.ఆదిత్య, శ్రీసిటి ఎం.డి రవీంద్ర సన్నారెడ్డిల సమక్షంలో ఆయా కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఎంఓయులపై సంతకాలు చేశారు. ఈ 14కంపెనీలలోనూ 5కంపెనీలు మన దేశానివి కాగా అమెరికా కంపెనీలు 3, చైనావి 3, జపాన్ 2, సింగపూర్ 1 కంపెనీలున్నాయి. ఈ కంపెనీల పెట్టుబడులతో శ్రీసిటీలో సుమారు 4వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుంది. ఈ సందర్భంగా శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ వ్యాపారానికి అత్యంత అనుకూలమైన పరిస్థితులను ఏర్పాటు చేసిన మన ప్రియతమ ముఖ్యమంత్రి పిలుపుమేరకు దేశ విదేశాలనుండి రాష్ట్రంలో పెట్టుబడులకై ప్రఖ్యాత వ్యాపార సంస్థలు పోటీ పడుతున్నాయని, ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌళిక వసతులున్న శ్రీసిటీని తమ వ్యాపార గమ్యంగా వివిధ కంపెనీలు ఎంపిక చేయటం తమకు గర్వకారణమన్నారు. ఈ నూతన పెట్టుబడుల వల్ల ఆ ప్రాంతంలో ఆర్ధికాభివృద్ధి జరగగలదన్న అశాభావాన్ని ఆయన వ్యక్త పరిచారు.

# సర్వే చెప్పినట్లే సీట్లు

## • ఎవరికీ లభించని గ్యారంటీ!

**జిల్లాలో వై.యస్.జగన్ ప్రజాసంకల్ప పాదయాత్ర విజయవంతమైంది. 20రోజుల పాదయాత్రలో ఆయన జిల్లాలో 9 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్‌చేశాడు. జగన్ తన పాదయాత్రలో కర్నూలు జిల్లాలో ఇద్దరికే సీట్లు కన్‌ఫర్మ్ చేసాడు. అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో ఏ సీటు ఎవరికీ కన్‌ఫర్మ్ చేయలేదు. ఇప్పుడు నెల్లూరుజిల్లాలోనూ అదే జరిగింది. ఫలానా సీటు ఫలానా నాయకుడికే అని ఆయన చెప్పలేదు.**

సూళ్లూరుపేట సీటు సిట్టింగ్ ఎమ్మెల్యే సంజీవయ్యకు చెప్పాడని, నెల్లూరు నగరం సీటు అనిల్‌కే అని చెప్పాడని, దీంతో మిగిలిన నాయకులు అసంతృప్తితో వున్నారనే దుష్ప్రచారం జరుగుతోంది. నెల్లూరురూరల్‌లో నిర్వహించిన ఆర్యవైశ్యుల సమావేశంలో కొందరు ముక్కాల ద్వారకానాథ్‌కు సీటివ్వాలని కోరినప్పుడు అక్కడ ఆల్‌రెడీ అనిల్ వున్నాడని, అతను కూడా మీవాడేనని, ద్వారకాకు ఏం చేయాలో తాను చూసుకుంటానని చెప్పాడు. అలాగే నాయుడుపేట సభలో సంజీవయ్య గురించి పాజిటివ్‌గా చెప్పాడు. నెల్లూరురూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గట్టి నాయకుడే! అంతకుమించిన అభ్యర్ధి లేడు. అయినా కూడా శ్రీధర్‌రెడ్డే ఇక్కడ అభ్యర్థి అని జగన్ చెప్పలేదు. కావలి నియోజకవర్గంలో పర్యటిస్తున్నప్పుడు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డినే అభ్యర్థి అని జగన్ చేత చెప్పించాలని ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నించాడు. కానీ ఎక్కడా జగన్ నోరు జారలేదు. ఆఖరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కూడా తిరిగి సర్వేపల్లి నుండి ఆయనే పోటీ చేస్తాడని చెప్పలేదు.

ఈసారి టిక్కెట్లన్నీ కూడా ప్రశాంత్‌కిషోర్ సర్వే ప్రకారమే ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. పి.కె. టీమ్ ఇప్పటికే రంగంలోకి దిగింది. నియోజకవర్గాల వారీగా ఏ నియోజకవర్గానికి ఎవరైతే కరెక్ట్ అని సర్వే చేస్తున్నట్లు సమాచారం. పార్టీలో వున్న నాయకులనే కాకుండా పార్టీలో చేరే సూచనలున్న నాయకులను కూడా పరిగణనలోకి తీసుకుని పి.కె టీమ్ సర్వే చేస్తున్నట్లు వినికిడి. జగన్ కూడా ఈ సర్వే నివేదికల ఆధారంగానే సీట్లు కేటాయించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. 2014 ఎన్నికల్లో ఇలా చేయకుండా ఎవరికంటే వాళ్ళకు సీట్లు ఇచ్చేసి చాలా చోట్ల ఓడిపోయారు. పార్టీ ప్రభావం ఎంతున్నా అభ్యర్థుల ప్రభావం కూడా కొంతుంటేనే గెలుపుకు దగ్గరవుతారు. సర్వే ద్వారా అలాంటి అభ్యర్థులనే రంగంలోకి దించనున్నారని తెలుస్తోంది.

## చంద్రన్న పాలనలో...

# దళితుల జీవితాల్లో ధగధగలు

### - కోడూరుపాడు కార్యక్రమంలో మంత్రి నారాయణ

నెల్లూరు రూరల్ మండలంలోని కోడూరుపాడు గ్రామంలో రింగ్‌రోడ్డు నిర్మాణానికి తక్షణమే రెండున్నర కోట్ల రూపాయలు మంజూరుచేస్తున్నట్లు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా. పి.నారాయణ వెల్లడించారు. గత నెల 24వ తేది ఎస్‌సి ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులతో 1వ డివిజన్ కోడూరుపాడులో సుమారు 7 కోట్లా 73 లక్షల రూపాయలతో రోడ్లు, డ్రైన్లు తదితర మౌలిక వసతుల ఏర్పాట్లకై శంకుస్థాపనలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, నగరంలో ఇప్పటిదాకా గత యాభైఏళ్ళలో ఏనాడూ లేని విధంగా ఒకే ఏడాదిలో 111 కోట్ల రూపాయల ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులను దళితవాడల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు కేటాయించడం జరిగిందన్నారు. ప్రతి దళితవాడలో మౌలికవసతుల ఏర్పాటుతో పాటు ఆసుపత్రి, స్కూలు, మంచినీటి వసతి, విద్యుత్‌దీపాల సౌకర్యం ఏర్పాటుచేయాలన్నది రాష్ట్రప్రభుత్వ ధ్యేయమన్నారు. దళితుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. నగరానికి సంబంధించి కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులను మార్చి 15వ తేది లోపల ఖర్చు చేయాల్సివుందన్నారు. ఎస్సీల అభ్యున్నతికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆర్ధికసాయం, ఎన్టీఆర్ విద్యోన్నతి, అంబేద్కర్ ఓవర్‌సీస్ విద్యోన్నతి, అంబేద్కర్ స్మృతి వనం వంటి అనేక కార్యక్రమాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని వివరించారు. అనంతరం వెంకటేశ్వరపురంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో ఏర్పాటు చేయనున్న డ్రైన్లు, రోడ్ల పనులకు మంత్రి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీమంత్రి ఆదాల ప్రభాకరరెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నగరపాలక కమిషనర్ ఆలీంబాషా, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, కార్పొరేటర్ పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న మంత్రి పి.నారాయణ, మేయర్ అజీజ్, ఆదాల ప్రభాకర్‌రెడ్డి

# నోటికొచ్చినట్లు వాగితే బాగుండదు

### - బీజేపీ నేతలకు 'నుడా శీనయ్య' వార్నింగ్

బీజేపీ నాయకులు సోము వీర్రాజు, సన్నపరెడ్డి సురేష్‌రెడ్డిలు నోర్లు అదుపులో పెట్టుకోవాలని, చంద్రబాబుపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలే బుద్ధిచెబుతారని నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. గత నెల 26వ తేదీ నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ దురుద్దేశ్యంతోనే వీళ్ళు చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రతి గంట, ప్రతి నిమిషం రాష్ట్రాభివృద్ధి కోసమే పాటు పడుతున్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తామంటే బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు. ప్రత్యేకహోదా లేదని, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్నా రాష్ట్రం కోసం ఒప్పుకున్నారు. ఇప్పుడు చివరి బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి అన్యాయం చేస్తే, చంద్రబాబు ఆ విషయాన్నే ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక ముఖ్యమంత్రి కేంద్రాన్ని నిలదీస్తే తప్పా? అని ఆయన ప్రశ్నించారు. నాలుగేళ్ళుగా జిల్లాలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని చెప్పడం బీజేపీ నేతల అజ్ఞానానికి నిదర్శనమని, నెల్లూరు, సంగం



బ్యారేజీలను, కొత్తగా వచ్చిన పరిశ్రమలను, నెల్లూరులో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులను, వెంకటేశ్వరపురం వద్ద 'హౌస్ ఫర్ ఆల్'లో భాగంగా కడుతున్న ఇళ్ళను చూస్తే ఈ నాలుగేళ్లలో ఎంత అభివృద్ధి జరిగిందో వారికే అర్ధమవుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, కార్పొరేటర్లు నాగేశ్వరరావు, ఉచ్చి భువనేశ్వర ప్రసాద్, నాయకులు మేకల రాజేంద్ర, కువ్వారపు బాలాజీ, మొయినుద్దీన్, ఢాకా మస్తాన్, పొన్నాల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## రైల్వే రిజర్వేషన్ కౌంటర్...
# వేళల కుదింపుతో ఇబ్బందులు




నిత్యం రద్దీగా ఉండే గూడూరు రైల్వేజంక్షన్‌లోని రిజర్వేషన్ కౌంటర్ సమయాల్లో విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ కొంత మార్పు చేశారు. ఇంతకుముందు ఉదయం 8గంటల నుండి రాత్రి 8గంటల వరకు రిజర్వేషన్ కౌంటర్ వుండేది. ఈ సమయాన్ని ఇప్పుడు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 4గంటల వరకు కుదించారు. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఉద్యోగులు, వ్యాపారస్తులకు ఇంతకుముందు ఉన్న సమయం చాలా అనుకూలంగా ఉంటుందేది. నెల్లూరు మరియు ముఖ్యమైన అన్ని రైల్వేస్టేషన్లలో రిజర్వేషన్ కౌంటర్ ఉదయం 8 గంటల నుండి రాత్రి 8గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంది. కాని గూడూరు రైల్వేజంక్షన్ అయ్యుండి కూడా రిజర్వేషన్ కౌంటర్ సమయాన్ని కుదించడం చాలా బాధాకరంగా వుందని ప్రజలు వాపోతున్నారు. విజయవాడ డివిజనల్ మేనేజర్ స్పందించి ఇంతకు ముందు ఉన్న సమయాన్నే కొనసాగించవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

# సాంకేతిక పరిజ్ఞానంతోనే ప్రగతి

గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ విద్యార్థులకు ఇ-బ్రెయిన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి సాంకేతిక సదస్సును సోమవారం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ ఏవీఎస్ ప్రసాద్ విద్యార్థులకు టెక్నాలజీ రంగంలో త్వరిత గతిన జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. శాటిలైట్ కమ్యూనికేషన్‌లో మినియేచర్ టెక్నాలజీని ఉపయోగించి సూక్ష్మ శాటిలైట్‌లను అభివృద్ధి చేస్తే శాస్త్ర, సాంకేతిక రంగంలో దేశ పురోగతి చెందుతుందని తెలిపారు. వీటి నమూనా పత్రాలను ప్రదర్శించారు. విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు, విభాగాధిపతి మునిరత్నం, ప్రతినిధులు అమిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నమూనా పత్రాలను ఆవిష్కరించిన కళాశాల డైరెక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు

# రైల్వేబోర్డ్‌లో మయూరి శ్యాం


రైల్వే జీఎం నుండి నియామక పత్రాలను అందుకుంటున్న మయూరి శ్యాంయాదవ్

సౌత్‌సెంట్రల్ రైల్వే గుంతకల్లు డివిజన్ రైల్వే బోర్డు మెంబర్‌గా తనను నియమించినట్లు ఆమేరకు రైల్వేజనరల్ మేనేజర్ నుంచి ఆదేశాలు అందాయని శ్రీకృష్ణ సేవాసమితి నిర్వాహకులు మయూరి శ్యాంయాదవ్ తెలిపారు. ఇటీవల గూడురులోని ఓ సమావేశ మందిరంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ రైల్వేలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, కౌన్సిలర్ బిల్లు చెంచురామయ్య, ప్రతినిధులు దొడ్ల నాగారాజయాదవ్, దాసరి వెంటేశ్వర్లు, పి.శ్రీనివాసులు, ప్రసాద్‌రావ్‌యాదవ్, గోపి తదితరులు పాల్గొన్నారు. కాగా, రైల్వే బోర్డు మెంబర్‌గా ఎన్నికైన శ్యాంయాదవ్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర పూలమాలతో సత్కరించారు.


మయూరి శ్యాంయాదవ్‌ను సన్మానిస్తున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర

# హోదా కోసం అందరూ కలిసిరావాలి
## - పార్టీలకు కాంగ్రెస్ పిలుపు


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య, పక్కన రఘువీరారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా సాధన కోసం అన్ని రాజకీయపార్టీలు జెండాలని పక్కనపెట్టి ప్రజాశ్రేయస్సుకు కలిసివస్తామంటే స్వాగతిస్తామని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ సమీపంలో డీసీసీ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రత్యేక హోదా - ఆంధ్రుల హక్కు' ఆంధ్రుల ఆత్మ గౌరవదీక్షను ఇటీవల పీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చెంచలబాబుయాదవ్, ఉపాధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే సి.వి.శేషారెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి రఘువీరారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకహోదా సాధన అనంతరం వచ్చే లబ్ది కూడా సంతోషంగా వారికే ఇస్తామని, ప్రజాశ్రేయస్సే కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమని తెలిపారు. దుగరాజపట్నం పోర్టు సాధనకు ఆనాడు కేంద్రమంత్రి పనబాక లక్ష్మి కృషి చేస్తే భారతీయ జనతాపార్టీ-తెలుగుదేశంపార్టీ ప్రభుత్వాలు పోర్టు లేకుండా చేయడం సిగ్గుచేటని చెప్పారు. వైజాగ్ - చెన్నై పారిశ్రామిక కారిడార్ వస్తే జిల్లా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయిచూపినా సీఎం చంద్రబాబు వేడి చూసే ధోరణిలోనే ఉండడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య మాట్లాడుతూ దుగరాజపట్నం ఓడరేవు వస్తే లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. మార్చి 2వ తేదీన జాతీయ రహదారి దిగ్బంధం, 6, 7, 8 తేదీలలో 'ఛలో పార్లమెంట్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి కె.మునిగిరీష్, గూడూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దువ్వూరు రవీంద్రరెడ్డి, నాయకులు సీతారాంబాబు, జిలాని, శరత్‌యాదవ్, జహంగీర్, శిద్దారెడ్డి, కల్లూరు రవి, కిషోర్ కుమార్, మీజూరుమల్లి పాల్గొన్నారు.

## ఎస్.వి.రత్నం ఛారిటీస్ సహకారంతో...
# విద్యార్థులకు ఉచిత వైద్యపరీక్షలు



విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

గూడూరు పట్టణంలోని బి.సి బాలికల వసతి గృహంలో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో ఎస్.వి. రత్నం ఛారిటీస్ సహకారంతో గత నెల 25న ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. కంటివైద్యులు జె.ప్రకాష్, దంతవైద్యులు యు.నారాయణ, జనరల్ ఫిజీషియన్ వెంకటసురేష్ పర్యవేక్షణలో వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు, కళ్లజోళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.వి.రత్నం ఛారిటీస్ అధినేత శ్రీకంఠ రామ్మోహన్‌రావు, రోటరీ వెస్ట్ అధ్యక్షుడు మోడిబోయిన సుబ్రహ్మణ్యం, కార్యదర్శి నాశిన నాగులు, సీనియర్ రొటేరియన్లు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, ఎన్.ఎస్.రెడ్డి, రాంప్రసాద్, చైతన్యకుమార్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, నవీన్‌చౌదరి, బాలసుబ్రహ్మణ్యం, వాసుగౌడ్, బొమ్మిడి శ్రీనివాసులు, తాళ్ళూరు శ్రీనివాసులు, బలరామిరెడ్డి, వసతిగృహ వార్డెన్ లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.





# ఎర్రచందనం స్మగ్లర్ల ఆస్తులు సీజ్‌చేయాలి
## - సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ

ఎర్రచందనం అక్రమరవాణాను పూర్తిస్థాయిలో అరికట్టడంతో పాటు, ఎర్రచందనం స్మగ్లర్ల ఆస్తులు జప్తు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ పోలీసు అధికారులను ఆదేశించారు. గత నెల 24న నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్‌లో డిఎస్పీలు, సిఐలు, ఎస్‌ఐలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎర్ర చందనం అక్రమ రవాణా అరికట్టేందుకు ఇప్పటికే అనేక చర్యలు చేపట్టామని, పెద్దఎత్తున దాడులు నిర్వహించి జాతీయ అంతర్జాతీయ స్మగ్లర్లను సైతం అరెస్ట్ చేసి వారివద్ద నుంచి కోట్లాదిరూపాయలు విలువజేసే ఎర్రచందనాన్ని, వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడులను మరింతగా విస్తృతం చేసి ఎర్రచందనం అక్రమరవాణాను పూర్తిస్థాయిలో నిరోధించాలన్నారు. అటవీ అధికారులను సమన్వయం చేసుకుని అడవుల్లో, సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. కొంతమంది సిబ్బందిపై ఆరోపణలు వినిపిస్తున్నాయని, వాటన్నింటిపై విచారణ జరుగుతోందని, ఆరోపణలు వాస్తవాలని తేలితే చర్యలు తప్పవన్నారు. పోలీసు సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరుపై సిఐలు, డిఎస్పీల పర్యవేక్షణ ఖచ్చితంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరుజిల్లా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ రోజ్‌దార్, జిల్లా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ విజయ పాల్గొని పోలీసు అధికారులకు 2016 ఏపి అటవీ చట్టంలోని పలు కీలకాంశాలను వివరించారు. జిల్లాలోని వివిధ కోర్టుల్లో పనిచేస్తున్న ఏపిపిలు ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో పోలీసు అధికారులు న్యాయపరంగా తామెదుర్కొంటున్న సమస్యలు, కేసుల గురించి వారితో చర్చించి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటగిరి సి.ఐ బదిలీ

నెల్లూరుజిల్లా వెంకటగిరి సి.ఐ మద్ది శ్రీనివాసరావు ప్రకాశం జిల్లా దరిశి సిఐగా బదిలీ అయ్యారు. మద్ది శ్రీనివాసరావు దాదాపు రెండున్నరేళ్లపాటు వెంకటగిరి సిఐగా బాధ్యతలు నిర్వర్తించారు. అసాంఘిక శక్తుల ఆటలు కట్టించడం, అక్రమ రవాణాను నియంత్రించడంలో కీలక భూమిని పోషించి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. గతంలో ఆయన జిల్లాలో ఎస్సైగా, ఒకటవ నగర సిఐగా బాధ్యతలు నిర్వర్తించారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 2.3.2018 నుండి**
**తేది. 8.3.2018 వరకు**

ఈ వారము సింహ కన్య తుల వృశ్చిక రాశులలో చంద్రుడు, కర్కాటక రాహువు, తులలో గురువు, వృశ్చికంలో కుజుడు, 7తేది నుండి ధనుస్సులో కుజుడు ధనుస్సులో శని, మకరంలో కేతువు, కుంభంలో రవి, మీనంలో బుధ శుక్రులు సంచరిస్తారు.

### పంచాంగము:

ముహూర్తములు
8తేది గురువారం ఉదయం గంట 7.30 నుండి 8.40లోగా
వ్యాపార గృహారంభ వివాహములు.

### ఫాల్గుణమాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 2 | శుక్ర | పాడ్యమి | రా॥ గం.5.32వ॥ |
| తేది. 3 | శని | విదియ | రా॥ గం.3.58వ॥ |
| తేది. 4 | ఆది | తదియ | రా॥ గం.3.16వ॥ |
| తేది. 5 | సోమ | చతుర్థి | రా॥ గం.3.3వ॥ |
| తేది. 6 | మంగళ | పంచమి | రా॥ గం.3.21వ॥ |
| తేది. 7 | బుధ | షష్ఠి | రా॥ గం.4.8వ॥ |
| తేది. 8 | గురు | సప్తమి | రా॥ గం.5.23వ॥ |

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

స్థిరాస్తుల లావాదేవీలు జరుపవద్దు. ప్రముఖులను కలుసుకొంటారు. ఉద్యోగులకు శ్రమభారం పెరుగుతుంది. కుటుంబ సౌఖ్యం, ఆరోగ్యం బాగుంటుంది. అనుకున్న పనులు విజయవంతంగా జరుపుతారు. వృత్తి జీవనం కలవారికి ఆదాయం, అభివృద్ధి బాగుంటుంది. వ్యాపార రంగాలలో ఆశించిన ఫలితాలుండవు, ఆదాయం సామాన్యం. దూరప్రయాణాలుంటాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

చిన్న వ్యాపారులకు ఫరవాలేదు. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. ప్రముఖులను కలుసుకొంటారు. సామాజిక కార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలి. ఆర్థిక స్థితి సంతృప్తికరంగా ఉండదు. సామాన్య ఆదాయముంటుంది. ఇతరులకు సేవ క్రింద పనులు జరుపవలసి ఉంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత బాగుంది. కొత్త విలువైన వస్తువులు, గృహోపకరణాలు సమకూర్చుకొంటారు. విద్యార్థులకు మంచి ప్రగతి ఉంది. స్థిరాస్తుల పెరుగుదలకు కృషి చేస్తారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు బాగా జరిగి ఆదాయం పెరుగుతుంది. బంధువర్గంతో విభేదాలు రావచ్చును. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

కాంట్రాక్టులు నిర్వహించేవారు, మార్కెటింగ్ వృత్తిలో గలవారికి ఆదాయం ఫరవాలేదు. పనులందు టెన్షన్ ఎక్కువుగా వుంటుంది. వస్తు, వాహన గృహ రిపేర్లుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంది. ప్రభుత్వ అనుమతులు మాత్రం లభించగలవు. చేపట్టిన పనులకు ఆటంకాలు కలుగవచ్చును.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. కుటుంబసౌఖ్యం, ప్రముఖులతో పరిచయాలుంటాయి. సోదర వర్గానికి అభివృద్ధి మేలు జరుగుతుంది. కొత్త నిర్మాణాలు జరిపే ప్రయత్నాలుంటాయి. విద్యా ప్రగతి బాగుంది. నూతన వస్తువులను సమకూర్చుకొంటారు. హామీల విషయంలో జాగ్రత్త అవసరం. ఆర్థికాభివృద్ధి ప్రయత్నాలు, ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలించగలవు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అనుకోని ప్రయాణాలుంటాయి. ప్రముఖులతో పరిచయాలుంటాయి. ఉద్యోగులకు అధికారుల సహకారం బాగుంటుంది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు పొందుతారు. విద్యావృద్ధి ఆరోగ్యం బాగుంటుంది. కష్టానికి తగ్గ ప్రతిఫలం ఉంటుంది. వృత్తి వ్యాపార రంగాలలో రాణిస్తారు. ఆదాయం పెరుగుతుంది. కొత్త వ్యాపార ప్రారంభాలకు నిర్ణయాలు జరుగుతాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఉద్యోగావకాశాలు లభించగలవు. దైవ కార్యాలు వేడుకలలో పాల్గొంటారు. కొత్త వస్తువులు సమకూర్చుకొంటారు. సోదర వర్గానికి మేలు జరుగుతుంది. అనుకోని ప్రయాణాలుంటాయి. విద్యావృద్ధికి కృషి బాగుంటుంది. శుభకార్యాలు నిర్ణయం కావచ్చును. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. మీ ప్రయత్నాలకు పరిస్థితులు అనుకూలిస్తాయి. బ్యాంకు ఋణాలు మంజూరు కాగలవు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఉద్యోగార్థులకు ఉద్యోగకృషి అనుకూలించగలదు. సమస్యల నుండి కొంత ఉపశమనం ఉంటుంది. అనవసర విషయాలలోకి మిమ్మల్ని ఇతరులు లాగకుండా జాగ్రత్త పడాలి. ఆరోగ్యం ఫరవాలేదు. అనుకోని అదనపు ఖర్చులుంటాయి. అవసరాలకు ఋణాలు చేయవలసి రావచ్చును. కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉన్నది. పెట్టుబడులకు అవకాశాలుంటాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉపయోగపడే ఖర్చులు అదనంగా ఉంటాయి. విద్యా ప్రగతి బాగుంటుంది. విందులు వేడుకలందు పాల్గొంటారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు పొందుతారు. పట్టుదలగా చేస్తే తప్ప పనులు జరగవు. ఉద్యోగ నిర్వహణ యందు గాని, వ్యవహారములందు గాని పొరపాట్లు జరుగకుండా జాగ్రత్తపడాలి. ఆర్థిక ఇబ్బందులు అంతగా ఉండవు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగులకు సామాన్యంగా జరిగిపోతుంది. అధికారులకు స్థానమార్పులు, నిరుద్యోగులకు అవకాశాలుంటాయి. శుభవార్త వింటారు. విద్యాప్రగతి బాగుంటుంది. పలుకుబడితో వ్యవహారాలను అనుకూలంగా నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారాలు ఉత్సాహకరంగా సాగి ఆదాయం పెరుగుతుంది. అయితే ఖర్చులు కూడా ఎక్కువగా ఉంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. రావలసిన బాకీలు కొంతవరకు అందుతాయి. ముఖ్యవస్తువులు, డబ్బును జాగ్రత్తగా పదిలపరచుకోవాలి. సాంకేతిక వైద్య, న్యాయ, క్రీడా రంగాల వారికి పురోగతి ఉంటుంది. కుటుంబసౌఖ్యం, ఆరోగ్యం బాగుంటుంది. ఉద్యోగులకు పనిభారం ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ధనప్రాప్తి, వస్తు లాభము ఉంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

శుభకార్య నిర్ణయాలు జరుగవచ్చును. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. అధికారులకు స్థానమార్పులుంటాయి. అనవసర విషయాలలో జోక్యం చేసికొనవద్దు. శుభవార్తలు వింటారు. విద్యార్థులు ఇంకా కృషి చేయాలి. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేయండి. ఆర్థిక వ్యవహారాలను జాగ్రత్తగా నిర్వహించాలి. వృత్తి వ్యాపారాలలో సంతృప్తి, షుమారైన ఆదాయముంటుంది.

# సింహపురి ధీరుడు... స్వర్గలోక సుందరి

శ్రీను గల్పిక

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరం. కాపువీధిలోని స్టైల్ ఆఫ్ సింహపురి, మాజీఎమ్మెల్యే ఆనం వివేకా(66) నివాసం. తెల్లారింది. పి.ఏ రాజు వచ్చి ఆయన గది బెల్ కొట్టాడు. వివేకా కళ్ళు తెరిచాడు. గదంతా చీకటిగా వుంది. ఈ అర్ధరాత్రి నన్ను లేపిందెవరబ్బా... ఎవరికి ఏం అవసరమొచ్చిందో అనుకుంటూ ఎవరు? అని కేకేసాడు. అవతల నుండి సార్, నేను రాజును, ఉదయాన్నే నిద్రలేపమన్నారు కదా అని చెప్పాడు. నేను లేపమన్నది పొద్దున, ఇంత అర్ధరాత్రప్పుడు కాదు అని వివేకా అన్నాడు. అప్పుడు రాజు... అయ్యో సార్, ముందు మీరు ఆ కళ్లకున్న నల్లద్దాలు తీసేయండి... టైం పొద్దున ఆరయ్యింది అని చెప్పాడు. అప్పుడు వివేకాకు అసలు విషయం అర్థమై కళ్లద్దాలు పక్కనపెట్టి, వెళ్లి తలుపు గడి తీసి రాజూ, కాఫీ తెమ్మని చెప్పు అని కుర్చీలో కూర్చున్నాడు. ఆరోజు పేపర్లు తిరగేసాడు. ఈలోపు కాఫీ కూడా రావడంతో ఆయన టీవీ ఆన్‌చేసి "ఆత్మసాక్షి" ఛానెల్ పెట్టి ఒక చేత్తో కాఫీ తాగుతూ ఇంకో చేత్తో సిగరెట్ పట్టుకున్నాడు. అప్పుడే ఛానెల్‌లో బ్రేకింగ్ న్యూస్ "అతిలోక సుందరి శ్రీదేవి హఠాన్మరణం" అని... ఆ న్యూస్ చూడగానే వివేకా షాక్... ఎడమ చేతిలో కాఫీ కప్పు, కుడి చేతిలో సిగరెట్... రెండూ క్రింద పడిపోయాయి. రాజూ ఆత్రుతగా వచ్చి సార్, ఏమైంది, ఏమైంది అంటూ పట్టుకుని ఊపాడు. పది నిముషాలకు గాని వివేకా ఈ లోకంలోకి రాలేకపోయాడు. స్పృహలోకి వచ్చాక ... శ్రీదేవి ఎంత గొప్ప నటిరా రాజు... మేం చిన్నప్పటి నుండి ఆమెను సినిమాల్లో చూస్తున్నాం... ఇప్పుడు పెద్దోళ్లమయ్యాక చూస్తున్నాం... నేను ఆమె అభిమానిని... ఆమె అభినయానికి అభిమానిని అంటూ వివేకా కన్నీళ్ళు పెట్టుకున్నాడు. ఆరోజంతా వివేకా అన్యమనస్కంగానే వున్నాడు. టిఫిన్, తిండి తినలేదు. అది పక్కన పెడితే ఆ బాధతో ఆరోజు ఒక్క సిగరెట్ కూడా కాల్చలేదు. అతను సిగరెట్లు కాల్చడం మొదలు పెట్టాక ఒక్క సిగరెట్ కూడా వెలిగించనిది ఆరోజే! ఆరోజంతా ఎవరిని కూడా కలవలేదు. ఆ బాధతోనే రాత్రి తన గదిలో పడుకుని నిద్రపోయాడు.

★★★★★

నెల్లూరులోని పెన్నానది ఆనకట్ట ప్రాంతం. వివేకా పెన్నలో ఈత కొడుతున్నాడు. అలా ఈత కొడుతుండగా ఇసుకలో ఆయన చేతికి ఏదో వస్తువు తగిలింది. పట్టుకుని తీసి చూసాడు. బంగారు ఉంగరం. పొద్దున్నే మా అమ్మ ఫోటో చూస్కొని వచ్చాను. అదృష్టం ఇలా అతుక్కుందనుకుని ఆ ఉంగరాన్ని వేలుకు పెట్టుకుని, స్విమ్మింగ్ ఆపి బయటకు వచ్చాడు. డ్రెస్ వేసుకుని సిగరెట్ వెలిగించాడు. అప్పుడే అతనికి వెనుక నుండి "మానవా" అనే మాట వినిపించింది. అప్పుడు అతను వెనక్కి తిరిగాడు. అతని కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. ఎదురుగా అప్సరస. చూడబోతే శ్రీదేవి లాగుంది. వివేకా తేరుకుని ఆమె తనను సిగరెట్ మానవా అని అడుగుతుందేమోననుకుని, 6ఏళ్ల వయస్సులోనే అయిన అలవాటు... 66ఏళ్ల వయసులో మాని ఏం చేయగలను అని అన్నాడు. ఆమె మళ్ళీ మానవా... నేను అంగులీయకము పోగొట్టుకుంటిని నీ చేతికి ఏమైనా దొరికిందా అని అడిగింది. అంగులీయకం అంటే అదేదో వస్తువు అనుకుని వివేకా... నాకు దొరకలేదని చేయి అడ్డంగా ఊపుతూ చెప్పాడు. చేయి ఊపేటప్పుడు అతని చేతికున్న ఉంగరాన్ని ఆమె చూసింది. అతను కావాలనే అబద్ధం చెబుతున్నాడనుకుని... నా పేరు ఇంద్రజ, స్వర్గలోకపు వాసిని, ఆ అంగులీయకం లేకుంటే స్వర్గంలోకి ప్రవేశం ఉండదు... నా అంగులీయకం నాకివ్వు అని ఆమె అడిగింది. ఈమెవరో జిడ్డు కేసులాగుంది... వదిలించుకునిపోతే బెటర్ అనుకుంటూ రోడ్డు మీదకొచ్చి కారెక్కి రయ్‌మని ఏ.సి సెంటర్‌కు పోనిచ్చాడు. ఇంటి వద్ద కారాపి... హమ్మయ్యా... ఆమెను వదిలించుకున్నాను అంటూ కారు దిగాడు. 'మానవా, ఇదేనా మీ నివాస గృహము' అనే మాట వినిపించడంతో కారు పైకి చూసాడు. ఇంద్రజ కారు టాప్ మీద వుంది. నువ్వెలా వచ్చావ్ అని వివేకా అడిగాడు. నువ్వు కారులోపల కూర్చుంటివి, నేను కారుపైన కూర్చుని ఈ సుందర నగర అందాలను వీక్షిస్తూ వచ్చితిని అని ఇంద్రజ చెప్పింది. అసలు నీ బాధేంటి అని వివేకా అడిగాడు. నా అంగులీయకం నాకిస్తే నేను మా స్వర్గలోకమునకు వెళ్లెదను అని అంది. ఈ తిక్క మాలోకం నాకెక్కడ తగిలింది రా బాబూ అనుకుని... మా ఇంటిలోకి రా... అలాగే ఇస్తాను అంటూ ఇంట్లోకి రమ్మన్నాడు. ఇంద్రజ అలాగే అంటూ కారు దిగి ఇంట్లోకి అడుగుపెట్టింది. అప్పుడే వివేకా అక్కడ స్థంభానికి కట్టేసి వున్న కుక్కను 'ఇంద్రజ' మీదకు ఉస్కో అంటూ ఉసిగొల్పాడు. కుక్క దెబ్బకు ఆమె పరారవుతుందనుకున్నాడు. కుక్క పరుగున వచ్చింది. ఇంద్రజ కళ్ళల్లో మెరుపులు చూసింది. అంతే ముందు కాళ్ళు పైకెత్తి ఆమెకు నమస్కరించింది. అది చూసి వివేకా షాక్... ఈమె నిజంగానే స్వర్గలోకపు సుందరి లాగుంది. ఈమె కళ్ళల్లో ఆ తేజస్సు వుంది. ఇంతకీ ఆమె అడుగుతున్న 'అంగులీయకం' అంటే ఏమిటి? వెంటనే తెలుసుకోవాలనుకుని బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులుకు ఫోన్ చేసి... స్వామీ అంగులీయకం అంటే ఏమిటని అడిగాడు. దానికాయన అంగులీయకం అంటే ఉంగరం అని చెప్పాడు. అప్పుడు వివేకాకు చిరంజీవి - శ్రీదేవి నటించిన 'జగదేకవీరుడు అతిలోక సుందరి' సినిమా కళ్ళముందు తిరిగింది. ఈ సుందరి దేవకన్యలతో కలిసి నెల్లూరు విహారానికొచ్చినట్లుంది. చెలికత్తెలతో కలిసి పెన్నలో ఈతకు దిగుంటుంది. అక్కడే ఉంగరం పోగొట్టుకుని వుంటుంది. అది నాకు దొరికింది. ఇప్పుడు ఈ ఉంగరం ఇస్తే తన దారిన తాను పోతుంది. ఇలాంటి దేవతలు భూలోకంలో కూడా వుండాలి. ఆమె ఇక్కడే వుండాలంటే ఈ ఉంగరం ఇవ్వకూడదు అని మనసులో అనుకున్నాడు. తర్వాత ఆమెతో... మీరు చెబుతున్న అంగులీయకం ఎక్కడుందో నాకు తెలియదు. మా వాళ్ళు పోలీసుస్టేషన్‌లో కంప్లైంట్ ఇస్తారు. అది దొరికేదాకా మీరు నెల్లూరులోనే ఓ ఇల్లు తీసుకుని వుండండి అని చెప్పాడు. అంతలో పెద్ద శబ్దంతో వెలుగు... కామధేనువు మీద ఇంద్రుడు అక్కడ దిగాడు. చూడ్డానికి మనిషి కైకాల సత్యనారాయణ లాగున్నాడు. ఇంద్రజ కామధేనువు ఎక్కు, మన లోకానికి పోదాం అని చెప్పాడు. అది విని వివేకా హా హా హా... అంటూ పెద్దగా నవ్వుతూ... ఆమె వద్ద అంగులీయకం లేదు కదా అని వెటకారంగా అన్నాడు. దానికతను ఇదేమన్నా 'జగదేక వీరుడు - అతిలోక సుందరి' సినిమా అనుకుంటున్నావా... ఆమె ఇంతకాలం ఇక్కడ వుంది కాబట్టి ఇది స్వర్గం... ఇక నుండి వుండాల్సింది మా లోకంలో... అందుకే ఆమెను తీసుకెళుతున్నాను అంటూ కామధేనువుపై ఇంద్రజను ఎక్కించుకుని 'జై జగన్మాత' అని అన్నాడు. కామధేనువు గాల్లోకి లేచింది. 'ఇంద్రజ'ను ఎలాగైనా ఈ లోకం వదిలి పోకుండా చూడాలన్న తపనతో వివేకా గాల్లోకి ఎగిరి కామధేనువు తోక పట్టుకున్నాడు. కాని దాని తోక జారిపోతుంది. అది చూసి ఇంద్రుడు బిగ్గరగా నవ్వుతూ... మీ మానవులు ఇలాంటి చేష్టలు చేస్తారనే కామధేనువు తోకకు దట్టంగా ఆముదం పూసుకుని వచ్చానన్నాడు. అప్పుడే వివేకా చేతులు తోక నుండి జారాయి. ఆయన మోసం, దగా అంటుండగానే ఆకాశంలో నుండి క్రింద పడసాగాడు. ఆ భయంతో కాపాడండి... కాపాడండి... అంటూ పెద్దగా కేకలు పెట్టసాగాడు వివేకా...

ఆ కేకల దెబ్బకు పైగదిలో వున్న పెద్ద కొడుకు ఏ.సి.సుబ్బారెడ్డి, క్రింద హాల్‌లో వున్న చిన్నకొడుకు రంగమయూర్‌రెడ్డి, పి.ఏ రాజులు పరుగెత్తుకుంటూ వచ్చారు. ఆయనను గట్టిగా పట్టుకుని ముఖాన నీళ్ళు చల్లారు. అప్పటికిగాని ఆయన ఈ లోకంలోకి రాలేదు. అప్పటిదాకా వచ్చింది కల అని తెలుసుకున్నాడు. ఏమైంది సార్ అని రాజు అడిగాడు. శ్రీదేవి స్వర్గానికి వెళుతూ కూడా ఈ అభిమానిని పలుకరించిపోయిందిరా... మహానటి అంటూ రెండు కన్నీటి చుక్కలు రాల్చాడు.

**(యావత్ భారత సినీ అభిమానులను శోక సంద్రంలో ముంచి స్వర్గానికి పయనమైన 'అతిలోక సుందరి'కి నివాళులర్పిస్తూ...)**

# కల్యాణ వైభవం...!



స్వర్గీయ జక్కా రాధాకృష్ణారెడ్డి - సుజాతమ్మల మనుమడు, కీర్తిశేషులు జక్కా రంగారెడ్డి మునిమనుమడు, కారెంపూడి చంద్రశేఖర్‌రెడ్డి - అనూరాధల కుమారుడు **తేజ - తృప్తి** (రాపాక్ ప్రేమ్‌రెడ్డి - రోహిణిల కుమార్తె)ల వివాహం ఫిబ్రవరి 25వ తేదీ హైదరాబాద్‌లోని జెఆర్‌సి కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' దీవెనలు.



నెల్లూరులోని గీతాంజలి ఇంగ్లీషు మీడియం స్కూల్ అధినేత యారం వెంకటరామయ్య - విజయలక్ష్మిల కుమారుడు **వెంకట వంశీకృష్ణ - పూజిత** (మనుబోలు మండలం లక్ష్మీనరసాపురం వాస్తవ్యులు చెదులవాడ కృష్ణయ్యనాయుడు - వెంకట ప్రమీలల కుమార్తె)ల పెళ్ళి ఫిబ్రవరి 23వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ నందు జరిగింది. నూతన జంటకు 'లాయర్' శుభదీవెనలు.



వింజమూరు వాస్తవ్యులు ఇనగనూరు మోహన్‌రెడ్డి మేనల్లుడు (గువ్వల జనార్ధన్‌రెడ్డి (లేట్) - ప్రమీల కుమారుడు) **మదన్‌గోపాల్‌రెడ్డి - వెంకట హారిక** (ఆత్మకూరు వాస్తవ్యులు కోడూరు శరత్‌కుమార్ - రాజేశ్వరిల కుమార్తె)ల పరిణయం ఫిబ్రవరి 24వ తేదీ వింజమూరులోని త్రిశూల్ గార్డెన్స్‌లో జరిగింది. కొత్త దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.



సూళ్ళూరుపేట మండలం కోటపోలూరు వాస్తవ్యులు గ్రిద్దటి శ్రీధర్‌రెడ్డి - సుధల కుమార్తె **పూజిత - నిషోక్‌రెడ్డి**(చెన్నై వాస్తవ్యులు కె.ఎ.మోహన్‌స్వామిరెడ్డి - సుగుణల కుమారుడు)ల కల్యాణం ఫిబ్రవరి 23వ తేదీ సూళ్ళూరుపేటలోని ఎస్.కె.ఎస్. కళ్యాణ మండపం నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

### కోటంరెడ్డి ఆధ్వర్యంలో...

## ప్రార్థనామందిరాలలో 'ప్రత్యేక' ప్రార్థనలు



సాయిబాబా మందిరంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ మేకపాటి, ఎమ్మెల్యే కోటంరెడ్డి

వై.యస్.జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రజాసంకల్ప పాదయాత్ర వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా, అలాగే రాష్ట్రానికి ప్రత్యేకహోదా ప్రసాదించాలని కోరుతూ ఫిబ్రవరి 28వ తేదీన నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూరల్ నియోజకవర్గ పరిధిలోని దేవాలయాలు, మసీదులు, చర్చిలు కలిపి మొత్తం 132 ఆధ్యాత్మిక కేంద్రాలలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. మొత్తం 15వేలమందికి పైగా ప్రజలు ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల అన్నదానాలు, వస్త్రదానాలు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పాలాభిషేకాలు నిర్వహించారు. ఏ.సి మార్కెట్ సాయిబాబా గుడి, రెడ్‌క్రాస్ వీధిలోని చర్చి, బారాషహీద్ దర్గాలలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి పాల్గొని ఒక మంచి కార్యానికి భగవంతుడి ఆశీస్సుల కోసం కోటంరెడ్డి ఓ పెద్ద కార్యక్రమం చేపట్టాడంటూ అభినందించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో పాటు వైసిపి నాయకులు తాటి వెంకటేశ్వరరావు, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, మురళీకృష్ణయాదవ్, సుధీర్‌కుమార్‌రెడ్డి, సలీం, సత్తార్, పచ్చా రవి, మొయిళ్ళ గౌరి, తోట శోభారాణి, మేఘనాథ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల మిత్రుడు జగనన్నే!

### - ఎమ్మెల్యే అనిల్



షేక్ కాలేషాను వైకాపాలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిల్

ఫిబ్రవరి 26వ తేదీన నెల్లూరు నగర 42వ డివిజన్‌లోని తెలుగుదేశం పార్టీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షులు షేక్ కాలేషా తన మిత్రులు, అనుచరులతో కలిసి నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్ సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీలకు మిత్రుడు జగనన్నేనని, వైసిపి అధికారంలోకి వస్తే మైనార్టీల సంక్షేమానికి ఆయన ఎన్నో కార్యక్రమాలు చేపట్టనున్నారని చెప్పారు. వైసిపి అధికారంలోకి వస్తే దుల్హన్ పథకంలో ఇస్తున్న 50వేలను లక్ష రూపాయలకు పెంచుతానని, ఇమామ్‌లకు 10వేలు, మౌజన్‌లకు 5వేలు వేతనం ఇస్తామని జగనన్న హామీ ఇచ్చారన్నారు. పార్టీ పదవులు, సీట్ల విషయంలో కూడా మైనార్టీలకు ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. చంద్రబాబు కేబినెట్‌లో ఒక్క ముస్లిం మంత్రి కూడా లేడని, దీనిని బట్టే మైనార్టీలంటే ఆయనకు ఎంత ప్రేముందో అర్ధమవుతుందని అనిల్ ఎద్దేవా చేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్.కె.కాలేషా, ఎండి ముజేన్నుల్, జానీ, మసూద్, సలాం, మునీర్, షరీఫ్, గౌస్‌బాషా, ఆరిఫ్, గౌస్‌అహమద్, రహీద్, సలీం, రబ్బానీ, తదితరులు పార్టీలో చేరగా, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు హంజాహుస్సేనీ, మునీర్‌సిద్ధిక్, ఎస్ఆర్ ఇంతియాజ్, మీరామొహిద్దీన్, ఎస్‌కె హాజీ, అబ్దుల్ సలాం, జావిద్, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

### వియామీ హోంలో...

## రోటరీ జన్మదిన వేడుక




రోటరీ జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి

రోటరీ అంతర్జాతీయ క్లబ్ ఏర్పడి ఫిబ్రవరి 23 నాటికి 113 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నెల్లూరు రోటరీ క్లబ్ వారు వియామీహోంలో క్లబ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మానసిక వికలాంగులు, దివ్యాంగుల సమక్షంలో కేక్ కట్ చేసి పిల్లలకు కేక్‌లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. రొటేరియన్‌లు ఎస్.రాఘవేంద్ర షెట్టి, నారపుశెట్టి నారాయణ, బెజవాడ సునీల్, ప్రసాద్‌రావులు వియామీహోంకు 15వేల నగదు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, క్లబ్ అధ్యక్షులు బి.వి.రెడ్డి, కార్యదర్శి ఎన్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# దైవం చెంతకు 'దేవి'

(మొదటి పేజీ తరువాయి)

శ్రీదేవి... ఈ పేరంటేనే తెలుగుసినీ జగత్తులో ఏదో తెలియని ఆనందం వెల్లివిరుస్తుంది. ప్రత్యేకించి శ్రీదేవి అభిమానులకు ఆమె పేరంటేనే ఒక సంబరం. ఆమె సినిమాలు చూసి ఆనందించిన ఎందరో అభిమానుల హృదయాల్లో ఆమె అందాల నటిగా.. అత్యద్భుత నటీమణిగా నిలిచిపోయారు. గత నెల 24న ఆమె దుబాయ్‌లో ఓ వివాహానికి వెళ్ళి ఉండగా, హోటల్ గదిలో ప్రమాదవశాత్తూ బాత్ టబ్‌లో పడి మృతి చెందినట్లు దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్ వర్గాలు నిర్ధారించాయి. ఆమె మరణవార్త విని యావత్ ప్రపంచం దిగ్భ్రాంతికి గురైంది. ఈ నేపథ్యంలో గత నెల 28న అశేష జనవాహిని అశ్రునయనాల మధ్య ఆమె అంత్యక్రియలు ముంబైలో జరిగాయి. శ్రీదేవి ఇక లేరనే విషయాన్ని జీర్ణించుకోలేక.. అభిమానజనం ఆమె భౌతికకాయాన్ని చూసి పెద్దపెట్టున రోదించారు. అందరూ శోక తప్త హృదయాలతో ఆమెకు కడసారి కన్నీటి వీడ్కోలు తెలిపారు. భర్త బోనీకపూర్ ఆమె చితికి నిప్పంటించగా, శ్రీదేవి ఇద్దరు కుమార్తెలు జాహ్నవి, ఖుషీ గుండెలవిసేలా విలపిస్తుండగా... దేశవ్యాప్తంగా తరలి వచ్చిన భారతీయ చిత్రపరిశ్రమ ప్రముఖులు, ప్రత్యేకించి బాలీవుడ్, టాలీవుడ్ నటులు, నటీమణులు ఇతర ప్రముఖులు ఉప్పొంగిన కన్నీటితో వీడ్కోలు చెప్తుండగా.. అందరి హృదయాలు బాధతో బరువెక్కుతుండగా శ్రీదేవి అంతిమ సంస్కారాలు యధావిధిగా జరిగిపోయాయి.

1963లో శివకాశిలో శ్రీదేవి జన్మించారు. 54ఏళ్ళ జీవితంలో దాదాపు 50ఏళ్ళ పాటు సినీలోకాన్ని ఏలిన ఇండియన్ సూపర్‌స్టార్ శ్రీదేవి తెలుగమ్మాయే. ఆమె తల్లి రాజేశ్వరి స్వస్థలం ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతి. శ్రీదేవి తండ్రి అయ్యప్పన్ తమిళనాడులోని శివ కాశిలో స్థిరపడ్డ తెలుగు కుటుంబం వారే. ఆయన తెలుగు చాలా చక్కగా మాట్లాడే వారు కూడా. తల్లిదండ్రులు చెన్నైలో ఉండేవారు. ఈ నేపథ్యంలో శ్రీదేవికి నాలుగేళ్ళ వయసు నుంచే వెండి తెరపై బాలనటిగా నటించే అవకాశం వచ్చింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 1967లో తొలిసారిగా ఆమె 'కందన్ కరుణై' అనే తమిళచిత్రంలో బాలనటిగా రంగప్రవేశం చేశారు. ఆ తర్వాత ఎన్నో సినిమాలు వచ్చాయి. ముఖ్యంగా 'బడి పంతులు' చిత్రంలో 'బూచాడమ్మా బూచాడు.. బుల్లిపెట్టెలో ఉన్నాడు' అనే పాటకు శ్రీదేవి చిన్నతనంలోనే అత్యద్భుతమైన నటన ప్రదర్శించి బాలనటిగా తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్నారు. ఆ తర్వాత హీరో యిన్‌గా ఎదిగారు. రెండు తరాల నటు లతోనూ అద్వితీయంగా నటించి అందరినీ తన నటనాచాతుర్యంతో మంత్రముగ్ధుల్ని చేశారు. 'అనురాగాలు, 'మా బంగారక్క', 'పదహారేళ్ళ వయసు' వంటి



శ్రీదేవి భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు

చిత్రాలతో ఆమె అద్వితీయమైన నటనతో ఎదుగుతూ అందరి ప్రశంసలూ అందుకున్నారు. ప్రేమాభిషేకం, వేటగాడు, కొండవీటి సింహం, దేవత, ఆఖరి పోరాటం వంటి చిత్రాలతో ఆమె నటనా ప్రతిభ ఉన్నత శిఖరాలకు చేరింది. తెలుగు తమిళ చిత్ర రంగాల మహానటులు ఎన్‌టి రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణ, శోభన్‌బాబు, ఎంజీఆర్, శివాజీగణేశన్ వంటి నట దిగ్గజాలతో పాటు, మెగాస్టార్ చిరంజీవి, అక్కినేని నాగార్జున, వెంకటేష్ వంటి హీరోలతో కలసి అనేక సినిమాల్లో నటించి ప్రేక్షకలోకాన్ని తన నటనాప్రతిభతో మురిపించి మెప్పించిన మహానటి శ్రీదేవి. బొబ్బిలిపులి, ప్రేమకానుక, కార్తీకదీపం ఇలా ఎన్నో చిత్రాలు ఆమె నటనా వైదు ష్యానికి నిదర్శనాలు. జగదేకవీరుడు –అతిలోక సుందరి చిత్రం మరో సూపర్ హిట్ కావడంతో, హిందీ చిత్రాల్లోనూ మంచి అవకాశాలు వచ్చాయి. విశ్వవిఖ్యాత నటుడు కమలహాసన్‌తో కలసి ఆమె నటించిన 'వసంత కోకిల', అకలి రాజ్యం వంటి చిత్రాలు చిత్ర పరిశ్రమ ఉన్నంత కాలం ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోయేవే. తమిళ చిత్ర రంగంలోనూ అనితరసాధ్యమైన రీతిలో విఖ్యాత నటుడు రజనీకాంత్‌తో ఏకంగా 23 చిత్రాల్లో నటించారు, కమల్‌హాసన్‌తో కలసి 22 చిత్రాల్లో నటించారు. అటు తెలుగులోను ఇటు తమిళం, మలయాళం, కన్నడ చిత్రాల్లోనూ ఆమె హీరోయిన్‌గా నటించి ప్రఖ్యాతి చెందారు. ఆ తర్వాత ఆమెకు హిందీ చిత్రాల్లోనూ మంచి అవకాశాలు వచ్చాయి. నటనను ఓ ఛాలెంజ్‌గా తీసుకుని, ఎంతో కృషి పట్టుదలతో ఆమె హిందీ హీరోయిన్‌గా పలు చిత్రాల్లో అద్వితీయ ప్రతిభతో రాణించడం విశేషం. మవాలీ, తోఫా, మిస్టర్ ఇండియా, సద్మా, చాందినీ, చాల్‌బాజ్, ఖుదాగవా, లమ్హే తదితర చిత్రాల్లో శ్రీదేవి నటన అపూర్వం. అద్భుతం కూడా. ఇవన్నీ బాక్సాఫీసును బద్దలుకొట్టి రికార్డులు సృష్టించిన చిత్రాలే. శ్రీదేవి హీరోయిన్ అయితే చాలు ఆ సినిమా హిట్టే అన్న టాక్ అంతటా వచ్చేసింది. అందుకు తగ్గట్టుగానే ఆమె నటించిన అనేక చిత్రాలు సూపర్‌హిట్ అయ్యాయి. నిర్మాతలకు లాభాల రాశులు పోశాయి. దాదాపు 250కి పైగా చిత్రాల్లో నటించి అద్వితీయ అందాల నటిగా ప్రఖ్యాతిగాంచిన శ్రీదేవి ఇండియన్ లెజండరీ యాక్టర్‌గా, ఇండియన్ సూపర్ స్టార్‌గా విశ్వవిఖ్యాతిగాంచారు. ఎన్నెన్నో విశిష్టమైన పురస్కారాలను, ఘనమైన అవార్డులను ఆమె అందుకున్నారు. 2013లో ఎంతో ప్రతిష్టాత్మకమైన 'పద్మశ్రీ' అవార్డును కూడా అందుకుని అటు తెలుగు వారికి, ఇటు భారతీయ చిత్రపరిశ్రమకు, నటనారంగానికీ మహానటి శ్రీదేవి ఎనలేని గౌరవం తెచ్చారు. 81 తెలుగు చిత్రాల్లోనూ, 72 తమిళ చిత్రాల్లోనూ అద్వితీయంగా నటించి, మరో 72 హిందీచిత్రాల్లోనూ అమోఘమైన నటనతో ఖ్యాతి చెందారు. ఇవికాక, 25 మలయాళం చిత్రాల్లోనూ, 6కన్నడ చిత్రాల్లోనూ నటించారు. మొత్తంగా 254 చిత్రాల్లో ఆమె నటనా వైభవం వర్ణించేందుకు మాటలు చాలవు. (అయితే 'మామ్' ఆమె 300వ చిత్రంగా పేర్కొంటున్నారు. మధ్యలోని 45 చిత్రాల వివరాలు తెలియరాలేదు.) వీటన్నిటికీ ప్రధాన కారణం ఆమె నిబద్ధత, క్రమశిక్షణ, అంతులేని కృషి.. నటనా రంగంలో ఆమెకు అనితరసాధ్య మైన ఇంత ఘనకీర్తిని తెచ్చిపెట్టాయి. అత్యంత అమోఘమైన ఆమె నటనా చాతుర్యం భారతీయ సినీరంగానికే శిఖరాయమానంలా నిలిచిందంటే అతిశయోక్తి కాదు. హిందీ చిత్రాల నిర్మాత బోనీకపూర్‌తో వివాహమయ్యాక ఆమె సినీ రంగానికి కొంతకాలం దూరమైనా, 2012లో తిరిగి ఆమె నటించిన 'ఇంగ్లిష్ వింగ్లిష్' చిత్రం ఓ సంచలనంగా నిలిచింది. దశాబ్దాదల తర్వాత ఆమె మళ్ళీ మేకప్ వేసుకున్నప్పటికీ ఎక్కడా తడబాటు లేకుండా తన నటనా కౌశలాన్ని ప్రదర్శించింది. సినీరంగ ప్రవేశం చేసిన రోజుల్లో తనకంటూ అప్పట్లో ఎవరి దన్నూ లేకపోయినా.. కేవలం స్వయంకృషితో, పట్టుదలతో నటనారంగంలో మెరుగులు దిద్దుకుంటూ, అనుభవపాఠాలు నేర్చుకుంటూ, తననుతనే తీర్చిదిద్దుకుంటూ జీవితంలో ఎంతో కష్టపడి ఒక మహా నటిగా ఎదిగిన మహోన్నత వ్యక్తిత్వం ఆమెది. తన ముద్దుముద్దు మాటలతో నటనకే అభినయం నేర్పించిన మహానటి.. ఫిబ్రవరి 24వ తేదీ రాత్రి ఆమె దుబాయ్‌లో మరణించారు. శ్రీదేవి భౌతికంగా మనమధ్య లేకపోయినా సర్వత్రా అందరి హృదయాల్లో నిండిపోయి వుంది. అదిగో ఆ నక్షత్రలోకంలోనూ జగజ్జేయమానంగా వెలుగులీనుతూ మిల మిలమెరిసే తారగా.. దివ్యతారగా.. ధృవ తారగా నిలిచిపోయింది. ఇండియన్ లెజండ్.. ఇండియన్ సూపర్‌స్టార్ శ్రీదేవి.. ఇక లేకపోవడం భారతీయ చలనచిత్ర రంగానికే తీరని లోటు. ఏనాటికీ తీరని.. ఒక విషాదమే!.. ఆ మహానటి కిదే.. మా కన్నీటి నివాళి!....

# రైతన్నలకు దిగుబడి వాన

(5వ పేజీ తరువాయి)

మాత్రమే పెట్టుబడి అవసరమవుతుంది. మిగతా పంటలకైతే ఎకరాకు 7 నుండి 8కట్టల దాకా రసాయన ఎరువులు, పురుగు మందులు వాడాల్సి వుంటుంది. 5 నుండి 6సార్లు పురుగు మందులు పిచికారీ చేయాలి. ఇంత పెట్టుబడి పెట్టి కష్టపడ్డా పుట్టి ధర 12వేల నుండి 14వేల మధ్యే వుంది. అదే తెలంగాణ సోన అయితే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందవచ్చు. సాధారణ రకాలతో పోలిస్తే ఎకరాకు 20వేల దాకా అదనపు రాబడి వుంటుంది. రసాయనాలు వాడని పంట కాబట్టి ప్రజలకు వీటి వాడకం వల్ల ఎటువంటి అనారోగ్యం ఉండదు.

## రైతుల్లో అవగాహన తేవాలి - కొర్రపాటి మురళీనాయుడు

అటు రైతులకు ఆదాయం, ఇటు ప్రజలకు ఆరోగ్యం అందించే వరి వంగడం తెలంగాణ సోన. ఇది రైతులకు మేలు చేకూర్చే పంట. ఈ పంటపై వ్యవసాయాధికారులు రైతుల్లో అవగాహన కల్పించాలి. సొసైటీల ద్వారానే రైతులకు విత్తనాలు అందించాలి. ఈ పంటను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైసిపి రైతు విభాగం జిల్లా కన్వీనర్ కొర్రపాటి మురళీనాయుడు కోరుతున్నారు.

# శివయ్య సన్నిధికి 'సరస్వతి'

(మొదటి పేజీ తరువాయి)

జగద్గురు శ్రీ జయేంద్ర సరస్వతి స్వామీజీ అసలు పేరు సుబ్రహ్మణ్య మహదేవన్. మన్నార్‌గుడి సమీపంలోని ఇరుళ్‌నీక్కి అనే కుగ్రామంలో ఆయన జన్మించారు. వేద విద్యాభ్యాసం చేసిన తరువాత 1954లో అప్పటి పీఠాధిపతి పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారి నుంచి సన్యాసం స్వీకరించారు. ఆ పీఠానికి బాల శంకరాచార్యులుగా అప్పట్లో బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత 40ఏళ్ళకు చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామీజీ నిర్యాణం చెందడంతో 1994లో శ్రీ జయేంద్ర సరస్వతి స్వామీజీ కంచికామకోటి పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించారు. జనకల్యాణ్, జనజాగరణ్‌ల పేరుతో ప్రజల్లో ఆధ్యాత్మిక భావపరంపరలను పెంపొందించారు.

## మాధవ సేవ... మానవ సేవే ధ్యేయంగా.....

దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో పర్యటించి ఆధ్యాత్మిక బోధలు చేసి, ప్రజల్లో ఆధ్యాత్మిక భక్తిభావాలను పెంపొందింప జేశారు. అనేక ఆసుపత్రులు, వేదపాఠశాలలు, విద్యాలయాలు, వృద్ధాశ్రమాలు, చిన్నారులకు వైద్యాలయాలు నెలకొల్పి మానవాళికి, సమాజానికి నిర్విరామ సేవలందించారు. గోశాలలు నెలకొల్పి మూగజీవాలకు ఆశ్రయం కల్పించారు. అంతేకాదు, 1993లో కాంచీపురంలో శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహావిద్యాలయాన్ని శ్రీ జయేంద్ర సరస్వతి స్వామీజీవారు ఏర్పాటు చేశారు. సైన్స్, ఇంజనీరింగ్, కంప్యూటర్ తదితర కోర్సులన్నీ అభ్యసించేందుకు వీలుగా ఈ విద్యాలయాన్ని రూపుదిద్దారు. ఇలా ఎన్నో మహత్కార్యాలను నిర్వహించి శ్రీ జయేంద్ర సరస్వతిస్వామీజీ జగద్గురువుగా అందరి పూజలందుకున్నారు. జగద్గురువు శ్రీ జయేంద్ర సరస్వతి స్వామీజీ నిర్యాణంతో అశేష భక్తజనులు కన్నీటి సాగరంలో మునిగిపోయారు.

## దేశం ఓ గొప్ప ఆధ్యాత్మికవేత్తను కోల్పోయింది -రాష్ట్రపతి

శ్రీ జయేంద్ర సరస్వతి మరణం పట్ల విచారం వ్యక్తం చేస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్రమోడీ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తదితర ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. దేశం ఓ గొప్ప ఆధ్యాత్మికవేత్తను, సమాజ సంస్కర్తను కోల్పోయిందని రాష్ట్రపతి పేర్కొన్నారు. జయేంద్ర సరస్వతి లక్షలాది భక్తుల మనసుల్లో జీవించే వుంటారని ప్రధాని తన సంతాపంలో తెలిపారు. గవర్నర్ ఇఎస్ఎల్ఎన్ నరసింహంతో పాటు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, కెసీఆర్‌లు జయేంద్ర సరస్వతి మృతికి విచారం ప్రకటించారు. ఆయన మరణం మానవాళికి తీరని నష్టమన్నారు. ఆధ్యాత్మిక గురువుగా ఉంటూ కంచి పీఠాన్ని బలమైన సంస్థగా తీర్చిదిద్దారని, పాఠశాలలు, వృద్ధాశ్రమాలు, గోశాలలు, కంటి ఆసుపత్రులు, చిన్నపిల్లలకు ఆసుపత్రులు నిర్వహింపజేస్తూ మానవసేవలో తరించారని వారు కొనియాడారు. వైకాపా అధ్యక్షుడు జగన్ తన సంతాపం ప్రకటిస్తూ, ధార్మికత, అత్యున్నత మానవతా విలువలను జీవితమంతా ఆచరించి ప్రబోధించిన గురువుగా, జగద్గురువుగా జయేంద్ర సరస్వతి ఖ్యాతిగాంచారని కొనియాడారు.

# కయ్యమా? వియ్యమా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ కాలం నాటికి ఉన్న తేడా చంద్రబాబుపై ఓటు–నోటు కేసు నమోదు కావడమే! నరేంద్ర మోడీ వాజ్‌పేయిలాంటోడు కాదు. వందమంది చంద్రబాబులను మిక్సీలో వేసి గ్రైండ్‌చేసి తీస్తే ఒక నరేంద్రమోడీ! రాజకీయంగా చంద్రబాబుకంటే నాలుగాకులు ఎక్కువే చదివాడు. బాబు కంటే బాగా ముదురు. ఈ నాలుగేళ్లలో చంద్రబాబుకు ఆయన పెద్దగా విలువ ఇవ్వలేదు. అసలు ఆయనకు అపాయింట్‌మెంట్ ఇవ్వడమే కనాకష్టంగా ఉండేది. చంద్రబాబుకు కూడా ప్రధాని మోడీ ధోరణి ఇబ్బందిగానే ఉండేది. అయినా కేసు మూలంగా ఓర్చుకుంటూ వచ్చాడు.

అయితే కేసుకు భయపడి కేంద్రానికి తలవంచే కొద్దీ రాష్ట్ర రాజకీయాలలో ఆయన బలహీనపడుతున్నాడు. ప్రజల్లో చులకనైపోతున్నాడు. ప్రతిపక్షాల చేత నానా మాటలనిపించుకుంటున్నాడు. ఇదే విధంగా కేంద్రానికి భయపడుతూ పోతే రాష్ట్రంలో తన రాజకీయ మనుగడ ప్రశ్నార్ధకమవుతుందనే ఆందోళన ఆయనలోనూ మొదలైంది. అందుకే ఈమధ్య కొంచెం నోరు తెరచి బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడు. బీజేపీతో పొత్తు తెంచుకోవడానికైనా సిద్ధమంటున్నాడు. ఆయనకు తెలుసు... బీజేపీతో పొత్తుంటే వచ్చే ఎన్నికల్లో నష్టపోతామని. 2014లో అదే బీజేపీతో పొత్తు వల్ల ఆయన లాభపడ్డాడు. కాని, రేపు ఎన్నికల్లో మాత్రం బీజేపీతో పొత్తుతో నష్టపోతాడు. నోట్ల రద్దు, జిఎస్టీ వంటి అంశాలతో పాటు ప్రత్యేకహోదా ఇవ్వనందుకు బీజేపీపై రాష్ట్ర ప్రజల్లో పీకలదాకా కోపం వుంది. ఆ కోపాన్ని రేపు బీజేపీ మీద, ఆ పార్టీతో పొత్తుంటే టీడీపీ మీద కూడా చూపిస్తారు. ఇది ఊహించాడు కాబట్టే చంద్రబాబు బీజేపీని వదిలించుకోవాలనుకుంటున్నాడు. బీజేపీని పక్కనపెట్టేసి జాతీయ రాజకీయాలలో మళ్ళీ చక్రం తిప్పాలన్నది ఆయన ఆలోచన. బీజేపీ, కాంగ్రెస్‌లకు వ్యతిరేకంగా మిగతా పార్టీలన్నింటిని ఒక తాటిపైకి తెచ్చి, తాను సారధ్యం వహించాలని, మోడీకి తన సత్తా చూపాలని తాపత్రయ పడుతున్నాడు. అందుకే కేసీఆర్‌ను కూడా మచ్చిక చేసుకునేందుకు తెలంగాణలో సైతం టీడీపీ పొత్తు పెట్టుకుంటుందని సానుకూల సంకేతాలు పంపాడు.

జాతీయ స్థాయిలో వున్న పరిచయాల దృష్ట్యా ఆయా పార్టీల నేతలను ఆయన ఒక వేదిక మీదకు తేగలడు కూడా! కాని 'ఓటు–నోటు' కేసు ఆయన ముందరికాళ్ళకు బంధంలా బిగుసుకుంది. అది వదిలితే కాని ఆయన విశ్వరూపం చూపలేడు. కాని అది ఇప్పుడిప్పుడే ఆయనను వదిలే అవకాశం లేదు. అప్పటికీ ఈ కేసు నుండి బయట పడేయమని ఢిల్లీలో తనకు తెలిసిన పెద్దలను వేడుకున్నట్లు సమాచారం. వాళ్ళు మాత్రం 'ఆ ఒక్కటి అడక్కు' అని చెప్పినట్లు తెలుస్తోంది. 'ఓటు–నోటు' కేసు నుండి బయటపడనిదే ఆయనకు చక్రం తిప్పే ఛాన్స్ రాదు. చూద్దాం ఏం జరుగనుందో...!

# ఒట్టి ఒప్పందాలేనా?



నాలుగేళ్ళుగా జిల్లాలో ఎటువంటి పారిశ్రామికాభివృద్ధి లేదు. దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి హయాంలో వచ్చిన పోర్టు, పరిశ్రమలు, సెజ్‌లు తప్పితే ఆయన తర్వాత ముగ్గురు ముఖ్యమంత్రులు వచ్చినా ఆశించిన ప్రగతి లేదు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక ఇఫ్కో సెజ్‌లో 'గమేషా' పరిశ్రమ తప్పితే ఇంకేమీ రాలేదు. ప్రతి సంవత్సరం పారిశ్రామిక సదస్సులు నిర్వహిస్తున్నారు. లక్షల కోట్ల ఎంఓయులు కుదుర్చుకుంటున్నారు. నెల్లూరు జిల్లాకు కూడా భారీఎత్తున పరిశ్రమలు, వేలకోట్ల పెట్టుబడులు అని ఊదరకొడుతూనే వున్నారు. ఈ నాలుగేళ్లలో ఏ పరిశ్రమ ఆనవాళ్ళు లేవు. ఇప్పుడు విశాఖపట్నంలో జరిగిన మూడురోజుల పారిశ్రామిక సదస్సులోనూ లక్షల కోట్లలో ప్రభుత్వం కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంది. వీటిలో 70కంపెనీల దాకా తమ పెట్టుబడులకు నెల్లూరు జిల్లాను ఎంచుకున్నాయని, రమారమి 50వేల కోట్ల పెట్టుబడులు పెట్టొచ్చని తెగ ప్రచారం చేస్తున్నారు. ఒక్క శ్రీసిటీలోనే 14కంపెనీలు తమ పెట్టుబడులకు ఆసక్తి కనపరిచాయి. ఇక ఎక్కువ కంపెనీలు కృష్ణపట్నం పోర్టు సెజ్‌లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయి. వేదాంత ట్రాన్స్‌ఫార్మింగ్, సుప్రీం ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఇండస్ కాఫీ వంటి పెద్ద కంపెనీలు కృష్ణపట్నం వైపే మొగ్గు చూపాయి.

నిజంగా ఒప్పందాల ప్రకారం జిల్లాకు పరిశ్రమలు వస్తే అంతకుమించిన ఆనందం ఇంకొకటి లేదు. ఒప్పందాలు కుదుర్చుకున్న వాటిలో సగం కంపెనీలు తమ పరిశ్రమలను స్థాపించినా జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి పరుగులు తీయడంతో పాటు వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మొదట వై.యస్. మరణంతో, ఆ తర్వాత నోట్ల రద్దుతో చావుదెబ్బతిన్న రియల్ ఎస్టేట్ రంగం ఊపిరి పీల్చుకుంటుంది.

ఏ కంపెనీ అయినాసరే తమ పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్రంలోనే ప్రస్తుతం అనువైన ప్రాంతం నెల్లూరుజిల్లా. పరిశ్రమల స్థాపనకు కావాల్సినంత భూమి ఉంది. రవాణా వసతులున్నాయి. పరిశ్రమలు పెట్టేవాళ్ళకు రాజకీయంగా కూడా ఇబ్బందులుండవు. ఇలాంటి జిల్లాలో పెట్టుబడులకు ఎవరైనా ముందుకొస్తారు. కాని రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు ఒక ఇండస్ట్రియల్ పాలసీని ప్రకటించలేదు. పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే దిశగా ఎలాంటి నిర్ణయాలు లేవు. అలాంటప్పుడు వూరికే పెట్టుబడులతో రమ్మంటే వస్తారా? రాష్ట్ర ప్రభుత్వం ఒక పారిశ్రామిక విధానాన్ని అమలులోకి తెస్తే పరిశ్రమలు ఏపి వైపు, అందులోనూ నెల్లూరుజిల్లా వైపు ఎక్కువగా పరుగులు తీయొచ్చు. లేదంటే గత నాలుగేళ్లలో జరిగిన ఎంఓయుల మాదిరిగానే ఇవి కూడా ఒట్టి ఒప్పందాలవుతాయి.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# ప్రయాణకేంద్రంగా ఇక కృష్ణపట్నం పోర్టు




నెల్లూరుజిల్లా పారిశ్రామిక ప్రగతికి గుండెకాయ లాంటి కృష్ణపట్నం పోర్టుకు ఇంతవరకు నౌకల ద్వారా సరుకుల రవాణాకు మాత్రమే అనుమతి వుంది. నౌకల ద్వారా ఎగుమతులు, దిగుమతులు జోరుగా సాగుతుండడం తెలిసిందే! తాజాగా కృష్ణపట్నం పోర్టులో ఇమ్మిగ్రేషన్ సెంటర్ ఏర్పాటుకు కూడా కేంద్ర జలరవాణాశాఖ అనుమతినిచ్చింది. అంటే ఇక ప్రజారవాణాకు కూడా కృష్ణపట్నం పోర్టును ఉపయోగించవచ్చు. కృష్ణపట్నంపోర్టు నుండి దేశంలోని ఏ ఇతర పోర్టులకైనా, లేదా విదేశాలకైనా నౌకాయానం చేయవచ్చు.

అయితే కృష్ణపట్నం నుండి నౌకల ద్వారా నౌకాయానం మొదలు కావాలంటే ఇంకా చాలాకాలం పట్టొచ్చు. ఎన్నో ఏళ్ళ క్రితం కట్టిన చెన్నై, విశాఖ పోర్టుల నుండే ప్రజారావాణా నౌకలు ఒకటి అరా నడుస్తున్నాయి. అది కూడా వారానికి ఒకటి లేదా రెండు నౌకలు అండమాన్‌కు వెళుతుంటాయి. సింగపూర్, మలేషియా, థాయ్‌ల్యాండ్ వంటి దేశాలలో నౌకాయానం వల్లే అక్కడ టూరిజం అభివృద్ధి చెందింది. మన దేశంలో కూడా ఇలా పోర్టుల నుండి ప్రజారవాణాను మెరుగుపరిస్తే పర్యాటక రంగం అభివృద్ధి చెందే అవకాశముంటుంది.






17వ వర్ధంతి

పూజ్యులు
స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు
నిర్యాణం: 06.03.2001

స్వర్గస్తులై 06.03.2018 నాటికి
పదిహేడు సంవత్సరాలు నిండుతాయి.

వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు:
వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
గ్లోబల్ కాంట్రాక్టర్, రామ్మూర్తినగర్, నెల్లూరు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com